PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 340 | విజయవాడ, సోమవారం 10 జులై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 10 July 2023 | Rs

నత్తనడకన నాడు-నేడు రెండో దశ

- నిధులు మంజూరులో జాప్యం
- గత 3 నెల్లో రూ.255 కోట్లే మంజూరు

లోపలి పేజీలో..

డిఎస్సి ఊసేలేదు

- మెగా అంటూ ఊరించిన ప్రభుత్వం
- ఎదురుచూస్తోన్న నిరుద్యోగులు
- ఖాళీలు 12వేలకు పైనే

2

బీమాకు ఇ-క్రాప్ దెబ్బ

- దిగుబడి ఆధారితానికి 'లోనీ ఫార్మర్స్'
- నమోదుల్లో తప్పులతో కోత
- ఇన్సూరెన్స్ పరిధిలోకొచ్చింది 25 లక్షల మంది రైతులు
- ఎస్సి, ఎస్టిలు ఒక్క శాతమే
- కౌల్దార్ల ఎంట్రీ నామమాత్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

నిరుడు ఖరీఫ్‌లో విపత్తు నష్టాలకు ప్రభుత్వం అమలు చేసిన దిగుబడి ఆధారిత పంటల బీమా క్లెయిములకు ఇ-క్రాప్ చిదిమేసింది. ఇ-క్రాప్‌లో నమోదైన రైతులందరికీ బీమా అమలవుతుందని ప్రభుత్వం పేర్కొనగా కేంద్ర పథకం ఫసల్‌బీమాలో చేరాక ఆ నిబంధనలు ఇ-క్రాప్ డేటాను పక్కన పడేశాయి. కేవలం బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకొని పంటలకు ఇన్సూరెన్స్ వర్తింపజేశాయి. రుణాలు తీసుకోని (నాన్‌లోనీ ఫార్మర్స్) వారిని వదిలేశాయి. లోనీ ఫార్మర్స్ అప్లికేషన్లు ప్రాసెస్ చేసే క్రమంలో మాత్రం ఇ-క్రాప్ డేటాతో సరిచూశారు. బ్యాంక్ రుణానికి నమోదైన పంట, ఇ-క్రాప్‌లో ఎక్కిన పంట ఒకటైతేనే ఇన్సూరెన్స్ పరిధిలోకి తీసుకొచ్చారు. దాంతో బీమా పరిధిలోకొచ్చిన రైతుల సంఖ్య బాగా తగ్గిపోయింది. పలు కొర్రీలతో కంపెనీలు ఆ మేరకు రైతులకు కూడా పరిహారం ఇవ్వట్లేదు. 2022 ఖరీఫ్‌లో 51 లక్షల ఎకరాలకు నోటిఫై చేసిన పంటలకు బీమా చేశారు. బ్యాంకుల్లో లోన్ తీసుకున్న 75,87,196 మంది రైతుల దరఖాస్తులురాగా వాటిలో 25,28,680 అర్జీలే ఇన్సూరెన్స్ చేయించడానికి అర్హత సాధించాయి. వాటిలో ఆరు లక్షల లోపు రైతులకు ఇప్పుడు పరిహారం ఖరారైందని సమాచారం. గతేడాది ఖరీఫ్‌లో కోటీ పది లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు వేయగా నూటికి నూరు శాతం ఇ-క్రాప్ జరిగిందని ప్రభుత్వం అప్పట్లో పేర్కొంది. దిగుబడి ఆధారిత బీమాకు సగం దరఖాస్తులు కూడా అర్హత సాధించలేదని తెలుస్తోంది.

ఎస్సి, ఎస్టిలు స్వల్పం

నిరుడు ఖరీఫ్‌లో పంటలకు ఇన్సూరెన్స్ చేసిన రైతుల్లో ఎస్సి, ఎస్టి రైతులు ఒక శాతమే ఉన్నారు. బీమా పరిధిలోకొచ్చిన ఎస్సి రైతులు 1.25 శాతం, ఎస్‌టిలు 1.11 శాతం. బీమా చేయించే దశలోనే ఆ వర్గాల రైతులు ఇంత తక్కువ ఉంటే పరిహారం పొందే విషయంలో ఇంకెంత తక్కువ మంది ఉంటారో ఊహించవచ్చు. బీమా పరిధిలోకొచ్చిన ఒబిసి రైతులు 79.67 శాతం, జనరల్ కేటగిరి రైతులు 17.97 శాతం.

కౌలు రైతులు నామమాత్రం

దిగుబడి ఆధారిత బీమాలో కౌలు రైతులు రెండు విధాలా నష్టపోయారు. ఇ-క్రాప్‌లో ఎక్కాలన్న నిబంధన ఒక వైపు కౌలు రైతులను బీమాకు దూరం చేసింది. కౌలు గుర్తింపు కార్డులు (సిసిఆర్‌సి) నాలుగైదు లక్షల మందికే ఇచ్చారు. వారిలో 70 వేల మందికే బ్యాంకులు రుణాలిచ్చాయి. ఫసల్ బీమాకు లోనీ ఫార్మర్స్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. దాంతో కౌలు రైతుల దరఖాస్తులు చాలా తక్కువ సంఖ్యలో పరిశీలనలోకి వచ్చాయి. ఇ-క్రాప్‌లో తప్పుల తడకల వలన ఆ వచ్చిన అర్జీల్లో చాలా మట్టుకు ఇన్సూరెన్స్ పరిధిలోకి రాలేదు. పరిహారం దగ్గరకొచ్చేసరికి కౌలు రైతులకు బీమా పరిహారం నామమాత్రం కూడా లేదని సమాచారం. కౌలు రైతుల అర్జీలు తగ్గినందునే ఎస్సి, ఎస్టి రైతులు చాలా తక్కువగా ఇన్సూరెన్స్ పరిధిలోకొచ్చారని విశ్లేషిస్తున్నారు.

బీమా పరిధిలోకొచ్చిన ఎస్సి, ఎస్టి రైతులు

జిల్లా	ఎస్సి శాతం	ఎస్టి శాతం
అల్లూరి	0.03	27.29
అనకాపల్లి	0.22	0.19
అనంతపురం	2.85	1.06
అన్నమయ్య	1.42	0.63
బాపట్ల	1.25	0.08
చిత్తూరు	1.11	0.12
కోనసీమ	1.80	0.06
తూర్పుగోదావరి	0.65	0.03
ఏలూరు	1.28	0.38
గుంటూరు	1.55	0.04
కాకినాడ	0.98	0.05
కృష్ణా	1.56	0.07
కర్నూలు	3.59	0.55
నంద్యాల	2.28	0.73
ఎన్‌టిఆర్	1.77	0.83
పల్నాడు	0.95	0.99
మన్యం	0.68	2.77
ప్రకాశం	3.16	0.61
నెల్లూరు	1.18	0.17
శ్రీసత్యసాయి	3.52	2.76
శ్రీకాకుళం	0.53	1.11
తిరుపతి	2.45	0.24
విశాఖపట్నం	0.15	000
విజయనగరం	0.32	0.08
పశ్చిమగోదావరి	1.86	0.08
కడప	2.18	0.27

మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

- తమిళనాడులో శాంతికే ముప్పుగా పరిణమించారు
- గవర్నరు చేష్టలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్టాలిన్ లేఖ

చెన్నై : వివాదాస్పదుడైన తమిళనాడు గవర్నరు ఆర్‌ఎన్ రవి చేష్టలతో విసుగెత్తిపోయిన ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆయనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఫిర్యాదు చేస్తూ ఆదివారం ఒక లేఖ రాశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యక్తి, తమిళనాడులో శాంతికి ముప్పుగా పరిణమించిన వ్యక్తి, తమిళనాడు రాష్ట్రానికి, తమిళ ప్రజలకు, తమిళ సంస్కృతికి శత్రువుగా ఉన్న వ్యక్తి గవర్నరు పదవికి ఎంతమాత్రమూ తగరని స్టాలిన్ ఆ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షాతో ఢిల్లీలో తమిళనాడు గవర్నర్ సమావేశమైన తరుణంలో స్టాలిన్ ఈ లేఖాస్త్రాన్ని సంధించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 159 ప్రకారం ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు రాజ్యాంగాన్ని, చట్టాన్ని పరిరక్షిస్తానని, తమిళనాడు ప్రజల సంక్షేమానికి అంకిత భావంతో పనిచేస్తానని ప్రతిజ్ఞ చేసిన గవర్నరు, ఆ ప్రమాణాన్ని తుంగలో తొక్కి కేంద్రానికి ఏజెంట్‌లా వ్యవహరిస్తూ, మన ఫెడరల్ స్ఫూర్తిని,ప్రజాస్వామ్య మౌలిక విలువలను మంటగలుపుతున్నారని ముఖ్యమంత్రి విమర్శించారు. రాష్ట్ర రాజధానిలో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎప్పుడు కూలదోద్దామా అని గవర్నరు ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులకు ఓకే చెప్పకుండా నెలల తరబడి గవర్నరు తొక్కిపెడుతున్నారని, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరికి భిన్నమైన రాజకీయ, సైద్ధాంతిక వైఖరి తీసుకుంటున్నారని, నిందితులకు మద్దతిస్తున్నారని పోలీసు దర్యాప్తుల్లో జోక్యం చేసుకుంటున్నారని స్టాలిన్ ఆ లేఖలో పేర్కొన్నారు. మంత్రి సెంథిల్ బాలాజీని ఏకపక్షంగా డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులివ్వడం, ఆతరువాత వాటిని నిలుపుచేస్తున్నట్లు ప్రకటించడం ఇవన్నీ గవర్నరు పిల్ల చేష్టలను తెలియజేస్తున్నాయని అన్నారు. ఆరు మాసాల క్రితం స్టాలిన్ ఇదే అంశంపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో, రాజ్యాంగ రూపకర్తల మనోభావాలను కాపాడేందుకుగానూ గవర్నర్‌ను రాజ్యాంగ పదవిలో కొనసాగించాలా లేదా అనే అంశాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకే వదిలివేస్తున్నానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఒబెరాయ్ గ్రూపు హోటళ్లతో ఎంఓయు కుదుర్చుకుంటున్న సిఎం జగన్

గండికోటకు ప్రపంచ ఖ్యాతి

- ఒబెరాయ్ హోటల్స్ భూమిపూజలో ముఖ్యమంత్రి జగన్
- వర్చువల్‌గా విశాఖ, తిరుపతిలోనూ ఒబెరాయ్ హోటళ్లకు శంకుస్థాపన
- 15న కడప ఉక్కు పరిశ్రమకు పర్యావరణ శాఖ క్లియరెన్స్

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

గ్రాండ్ కెన్యాన్ ఆఫ్ ఇండియాగా పిలిచే గండికోటను ఒబెరాయ్ సెవెన్ స్టార్ హోటల్స్ ద్వారా ఇక ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం జమ్మలమడుగు, పులివెందులలో ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జమ్మలమడుగు మండలం గండికోటలో ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి ఒబెరాయ్ గ్రూపు సిఇఒ విక్రమ్ సింగ్ ఒబెరాయ్‌తో కలిసి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. అనంతరం గండికోట, తిరుపతి, విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం అన్నవరంలో కూడా ఒబెరాయ్ గ్రూపు నిర్మించే 7 స్టార్ సౌకర్యాల లగ్జరీ రిసార్ట్స్ నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జగన్ మాట్లాడుతూ సూపర్ లగ్జరీ రిసార్ట్స్ ఇక్కడికి రానుండడంతో గండికోట గ్లోబల్ మ్యాప్‌లోకి వెళుతుందన్నారు. ఇలాంటి మరో రిసార్ట్స్‌కు ఇక్కడ త్వరలో శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. వీటిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభించనుందని పేర్కొన్నారు. జిందాల్ ఆధ్వర్యాన జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం వద్ద ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఈ ఏడాదే శంకుస్థాపన చేశామని, పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ నెల 15న పర్యావరణ శాఖ నుంచి క్లియరెన్స్ రానుందని, ఆ తర్వాత నుంచి పనులు మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. ఒబెరాయ్ గ్రూపు సిఇఒ విక్రమ్‌సింగ్ ఒబెరాయ్ మాట్లాడుతూ గండికోట, తిరుపతి, విశాఖలో చేపట్టిన హోటళ్ల నిర్మాణాలను 2025 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో చాలాచోట్ల పర్యాటక అభివృద్ధికి, రిసార్ట్స్ నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి మాట్లాడుతూ గండికోటతోపాటు పోలవరాన్ని కూడా పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా మాట్లాడుతూ విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పలు ఒప్పందాలు కుదిరాయని, వీటివల్ల 40 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయని అన్నారు. టూరిజం డెవలమెంట్ కార్పొరేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ్ మాట్లాడుతూ పర్యాటకంలో రాష్ట్ర జిడిపి 7.2 శాతం ఉందని, దీనిని 9.10 శాతానికి తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కడప ఎంపి అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రసంగించారు. ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎపిటిడిసి చైర్మన్ వరప్రసాద్, ఒబెరాయ్ గ్రూప్ పిసిఒ ప్రెసిడెంట్ శంకర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

ఆరుగురు దుర్మరణం

- శ్రీకాళహస్తి వద్ద కారును ఢీకొన్న లారీ
- మృతులంతా విజయవాడ వాసులు
- శ్రీవారిని దర్శించుకొని ఇంటికి వెళ్తుండగా ఘటన

కారును ఢీకొట్టిన లారీ

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

వెంకన్న దర్శనం చేసుకొని స్వస్థలానికి తిరిగి వెళ్తున్న వారిని మృత్యువు కబళించింది. అతివేగంగా వస్తున్న లారీ వారి కారును ఢీకొట్టడంతో ఆరుగురు దుర్మరణం చెందారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని కృష్ణలంకకు చెందిన తుంగల రమేష్ (48) కుటుంబం, ఆయన స్నేహితుల కుటుంబం శుక్రవారం వెంకన్న దర్శనార్థం కారులో తిరుమలకు వచ్చింది. శనివారం వెంకన్న దర్శనం ముగించుకుని విజయవాడకు ఆదివారం బయలుదేరింది. శ్రీకాళహస్తి పట్టణం మిట్టకండ్రిగ సమీపంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న లారీ వారి కారును బలంగా ఢీకొట్టింది. దీంతో, కారులో ప్రయాణిస్తున్న తుంగల రమేష్, ఆయన భార్య రాజ్యలక్ష్మి (40), వదిన శ్రీలత (42), స్నేహితులు రమణి (38), మూర్తి (47), మూర్తి కుమార్తె అక్షయ (16) అక్కడికక్కడే మృతి చెందారు. రమేష్ కుమారుడు భరత్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. లారీ వేగానికి కారు ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతో మృతదేహాలు చెల్లాచెదురుగా పడడంతో జాతీయ రహదారి రక్తసిక్తమైంది. సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని తిరుపతి ఎఎస్‌పి కులశేఖర్ తెలిపారు.

ఉత్తరాదిని ముంచెత్తిన వర్షాలు

- ఆకస్మిక వరదలు
- 15 మంది మృతి
- హిమాచల్‌లో కొట్టుకుపోయిన దుకాణాలు, కార్లు
- ఢిల్లీలో 41 ఏళ్ల తరువాత రికార్డు స్థాయి వర్షపాతం

హిమాచల్ ప్రదేశ్‌లో కులు వద్ద బియాస్ నది ఉగ్రరూపం

న్యూఢిల్లీ : ఉత్తర భారతదేశాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గడచిన 36 గంటల్లో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు, వరదల బీభత్సానికి 15 మంది చనిపోయారు. అనేక మంది గల్లంతయ్యారు. అత్యధికంగా హిమాచల్ ప్రదేశ్‌లో తొమ్మిది మంది మరణించారు. ఈ రాష్ట్రంలో వరద ఉధృతికి పలు దుకాణాలు, కార్లు కొట్టుకుపోయాయి. ఇక దేశరాజధాని ఢిల్లీలో గత 41 ఏళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయిలో వర్షపాతం నమోదయింది. దీంతో యమునా నది పొంగి పొర్లుతోంది జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్, పంజాబ్,హర్యానా రాష్ట్రాలు వర్షాలు, వరదలతో అతలాకుతలమయ్యాయి. పలు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. రోడ్లపై మోకాలు ఎత్తున వరద నీరు ప్రవహిస్తోంది. పలు చోట్ల చెట్లు, కొండ చరియలు విరిగిపడడంతో 17 రైళ్లను రద్దు చేస్తున్నట్లు, మరో పన్నెండింటిని దారి మళ్లిస్తున్నట్లు ఉత్తర రైల్వే ప్రకటించింది. ఢిల్లీలో రెండో రోజు కూడా వర్షాలు దంచికొట్టడంతో సోమవారం స్కూళ్లకు సెలవు ప్రకటించారు. 1982 తరువాత ఇదే అత్యధిక వర్షపాతమని అధికారులు తెలిపారు. 1982 జులై 25న 24 గంటల వ్యవధిలో 169.9 మీమీ వర్షపాతం కురిసింది. హిమాచల్ ప్రదేశ్‌లో గత మూడు రోజుల నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల కొండచరియలు విరిగిపడి ఇళు కూలిపోయాయి.వర్షాలతో గంగానది ఉగ్రరూపం దాల్చింది. దీంతో జాతీయ రహదారి 21ను అధికారులు మూసివేశారు. వరదల్లో పలు దుకాణాలు, కార్లు కొట్టుకుని పోయాయి. ఉత్తరాఖండ్‌లోనూ వర్షాలు జల విలయం సృష్టించాయి. రాజస్థాన్‌లో ఆదివారం ఉదయానికి గత 24 గంటల్లో వర్షాల కారణంగా నలుగురు మృతి చెందారు.

రాష్ట్రంలో తొమ్మిది జిల్లాల్లో 2,3 రోజుల వరకూ అతి భారీ వర్షాలు కురిసే అవకాశ ముందని వాతావారణ శాఖ హెచ్చరించింది. జమ్ముకాశ్మీర్‌లో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నలుగురు చనిపోయారు. మృతుల్లో ఇద్దరు సైనికులు కూడా ఉన్నారు. ఆకస్మిక వరదలకు పూంచ్ ప్రాంతంలో ఇద్దరు జవాన్లు చనిపోగా, దోడా జిల్లాలో కొండచరియలు పడి ఇద్దరు మరణించారు. దీంతో అమర్‌నాథ్ యాత్రను వరుసగా మూడవ రోజు కూడా నిలిపివేశారు.

గ్రామ పంచాయతీల సమస్యలపై 11న రౌండ్‌టేబుల్ సమావేశం : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీల సమస్యలపై ఈ నెల 11వ తేదిన విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కేంద్రం నుండి రావాల్సిన 15వఆర్థిక సంఘం నిధులను, రాష్ట్రం నుండి రావాల్సిన నిధులను వెంటనే గ్రామపంచాయతీలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనలకు, రాజ్యాంగానికి విరుద్ధంగా పాత కరెంట్ బిల్లులు, సర్‌చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి సర్పంచ్‌ల సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. గ్రామ అభివద్ధి, స్థానిక సంస్థలు బలపడాలని కోరుకునేవారు, ప్రజాస్వామికవాదులు ఈ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

తుది విజయం రాజధాని రైతులదే

- రైతు ఉద్యమ నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు
- 1300వ రోజుకు చేరిన ఉద్యమం

3

పర్యాటకానికి 450 ఎకరాలు

- టూరిజం శాఖ ప్రతిపాదనలకు భూయాజమాన్య సంస్థ పచ్చజెండా
- అరకు, కడప జిల్లాల్లో పలు ప్రాజెక్టులు
- సాగర తీర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

3

అనారోగ్య చీకట్లు

సరైన వైద్యం అందక ఆర్‌టిసి ఉద్యోగుల అవస్థలు

ప్రభుత్వం పట్టించుకోవాలని ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశామని ప్రభుత్వం గొప్పగా చెప్తున్నప్పటికీ వారి జీవితాల్లో అనారోగ్య చీకట్లు తొలగించే పని మాత్రం జరగడం లేదు. ఆర్‌టిసిలో చాలా కాలంగా ఉద్యోగ రిక్రూట్‌మెంట్లు లేకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పెరిగింది. అలాగే ప్రభుత్వంలో విలీనం కాకముందు వున్న వైద్య విధానాన్ని పక్కనపెట్టి, హెల్త్‌కార్డులతో కొత్త వైద్య విధానాన్ని తీసుకురావడంతో ఆర్‌టిసి ఉద్యోగులకు సరైన వైద్యం అందక రోగాల బారిన పడేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఆర్‌టిసిలో మొత్తం ఉద్యోగుల్లో 92 శాతం మంది రకరకాల జబ్బులతో ఇబ్బంది పడుతున్నారని ఇటీవల ఒక నివేదికలో ఆర్‌టిసి పేర్కొంది. రాష్ట్ర విభజన తర్వాత ఆర్‌టిసిలో మొత్తం 56,062 మంది ఉద్యోగులు ఉండాల్సి వుండగా, ఇప్పుడు 49,400 మంది మాత్రమే పనిచేస్తున్నారు. గత నాలుగేళ్లలో కొత్త రిక్రూట్‌మెంట్లు చేపట్టకపోవడంతో ఆర్‌టిసిలో ఖాళీల సంఖ్య నెలనెలా పెరిగిపోతోంది. అనారోగ్యంతో మృతిచెందినా, రిటైర్డు అయినా వారి స్థానంలో కొత్త రిక్రూట్‌మెంట్లు లేకపోవడంతో ఉన్న ఉద్యోగులపై పనిఒత్తిడి పెరిగింది. దీంతో ఆర్‌టిసి ఉద్యోగులకు 8 గంటల పని విధానం అనేది అందని ద్రాక్షలా తయారైంది. డ్రైవర్లు, కండక్టర్లు సగటున 10 నుంచి 11 గంటలు పని చేయాల్సి వస్తోంది. డిపోలు, వర్క్‌షాప్‌లలో వుండేవారు కూడా సగటున గంటకుపైబడి అదనంగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పనిభారానికి తోడు ఆర్‌టిసి ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థికపరమైన అంశాలను పక్కన పెట్టేయడంతో.. ఇంటాబయట సమస్యలతో తీవ్ర ఒత్తిడితో వారు అనారోగ్యాల బారిన పడుతున్నారు. దీనిపై ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బిపితో 15,004 మంది, మధుమేహంతో 13,390, ఆస్తమాతో 2,260, కేన్సర్‌తో 261, గుండె జబ్బులతో 2,363, కిడ్నీ వ్యాధితో 606, కంటి జబ్బులతో 3,562, న్యూరో జబ్బులతో 3,276, ఆర్థోతో 4,588 మంది ఉద్యోగులు బాధపడుతున్నారు. ఆర్‌టిసిలోని ఉద్యోగుల కేటగిరి ప్రకారం కండక్టర్లు 14,544 మంది, డ్రైవర్లు 17,795, మెకానిక్‌లు 1,966, ఆర్టిజెన్స్‌లో 949, హెల్పర్లు 1,120, శ్రామిక్‌లు 1,172, ఇతరులు 7,764 మంది కలిపి మొత్తం 45,310 మందికి జబ్బు చేసినట్లు ఆర్‌టిసి నివేదిక పేర్కొంది. మొత్తం 92 శాతం మంది ఉద్యోగులు అనారోగ్యం బారిన పడ్డారంటే పరిస్థితి తీవ్రత ఏమిటో అర్థమవుతుంది. ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రతి జిల్లాల్లో సొంత క్లినిక్‌లతోపాటు, విద్యాధరపురంలో మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక హాస్పిటల్ ఉండేది. ఆర్‌టిసి హాస్పిటల్స్‌లో సరైన చికిత్స లేకుంటే కార్పొరేట్ హాస్పిటల్స్‌కు రిఫర్ చేసేవారు. హెల్త్‌కార్డులను చాలా హాస్పిటల్స్ నిరాకరిస్తుండటంతో ఇటీవల కాలంలో వైద్యం అందక చనిపోతున్న ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందని ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఇతర ఉద్యోగుల్లా కాకుండా, ఆర్‌టిసి ఉద్యోగుల పని చాలా కష్టతరమైనది. నిరంతరం అప్రమత్తతతో ఉండాలి. అందుకే వీరిని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం వుందని ఆర్‌టిసి ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగుల అనారోగ్య సమస్యలను ప్రత్యేకంగా సమీక్షించాలని కోరుతున్నారు.

విశాఖలో ఘోరం

- బాలికపై అత్యాచారం
- వీడియో తీసి బెదిరింపులు
- దారుణానికి ఒడిగట్టిన ఓ పాఠశాల అటెండర్, అతని మిత్రులు

ప్రజాశక్తి- కరాస (విశాఖపట్నం)

విశాఖలో ఘోరం చోటుచేసుకుంది. బాలికపై ఓ అటెండర్‌తోపాటు నలుగురు అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని 104 ఏరియా బాపూజీ నగర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ కేసుపై ఆదివారం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎయిర్‌పోర్టు పోలీసుల కథనం ప్రకారం... నగరానికి చెందిన ఓ బాలిక 104 ఏరియాలోని ఒక పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆమెపై అదే పాఠశాలలో పనిచేస్తున్న అటెండర్ సత్యారావు కన్నేశాడు. మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. వివస్త్రను చేసి సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. ఫొటోలు, వీడియోలను తన మిత్రులకూ పంపించాడు. వారిలో నలుగురు కూడా బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. కొద్ది రోజులుగా బాలిక ప్రవర్తనలో మార్పు రావడం కుటుంబ సభ్యులు గమనించారు. ముభావంగా ఉండడం, చదువులో శ్రద్ధ తగ్గడం వంటి విషయాలను గమనించి బాలికను తల్లి ప్రశ్నించింది. దీంతో, జరిగిన విషయాన్ని బాలిక ఆమెకు ఏడుస్తూ చెప్పింది. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీసులకు బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సిఐ బిఎండి.ప్రసాదరావు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకుని ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. నిందితుని సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిశ పోలీస్ స్టేషన్‌కు ఈ కేసు అప్పగించారు. దిశ డిసిపి వివేకానంద ఘటనా స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు. బాలికకు ప్రస్తుతం కెజిహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. కాగా, బాధితురాలు నేవీ అధికారి కుమార్తె అని సమాచారం.

ముగ్గురిపై యాసిడ్ దాడి

ప్రజాశక్తి-నందిగామ (కృష్ణా జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామంలో శనివారం రాత్రి ముగ్గురు వ్యక్తులపై ఓ వ్యక్తి యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐతవరం గ్రామంలో ఉంటున్న అక్కిపల్లి తిరుపతమ్మ భర్త ఎనిమిది నెలల క్రితం మృతి చెందారు. రెండు నెలల క్రితం నెల్లూరుకు చెందిన ఆటోడ్రైవర్ మణిసింగ్ ఫేస్‌బుక్ ద్వారా ఆమెకు పరిచయం అయ్యాడు. మణిసింగ్ తరచూ తిరుపతమ్మను కలిసి వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. అతనికి టిబి ఉండడంతో తిరుపతమ్మ పెళ్లికి నిరాకరించింది. శనివారం రాత్రి తిరుపతమ్మ ఇంటిలోనే మణిసింగ్ ఉన్నాడు. నిద్రిస్తున్న తిరుపతమ్మపై తెల్లవారుజామున యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తిరుపతమ్మతో పాటు పక్కనే ఉన్న ఆమె కుమారుడు మోహిత్, అక్క కుమార్తె సువర్ణ గాయపడ్డారు. వారిని స్థానికులు విజయవాడలోని ఆంధ్రా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు కంచికచర్ల పోలీస్‌స్టేషన్లో లొంగిపోయాడు. ఎసిపి జనార్ధన్‌నాయుడు కేసు దర్యాప్తు చేపట్టారు. చికిత్స పొందుతున్న బాధితులను నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పరామర్శించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

డిఎస్‌సి ఊసేలేదు

- మెగా అంటూ ఊరించిన ప్రభుత్వం
- ఎదురుచూస్తోన్న నిరుద్యోగులు
- ఖాళీలు 12వేలకు పైనే

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న యువత (ఫైల్)

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సి నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయింది. ప్రతి ఏటా నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం పొందుపరిచింది. గడిచిన నాలుగేళ్లలో కేవలం ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేయలేదు. ఉపాధ్యాయ విద్య పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. విద్యాశాఖలో సుమారు 12 వేల వరకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడాదిన్నర వరకు 25 వేల వరకు ఖాళీలున్న పోస్టులను జిఓ 117తో ప్రభుత్వం 7 వేల వరకు తగ్గించింది. మరో 6 వేల పోస్టులను డిఎస్‌సి-1998, డిఎస్‌సి-2008 అభ్యర్థులతో సర్దుబాటు చేసింది. 117 జిఓతో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని పెంచి పోస్టులను కుదించింది. మరోపక్క వచ్చే జనవరి నాటికి మరో 5 వేలమంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయనున్నారు.

ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఉపాధ్యాయ పోస్టులు 717 మాత్రమే ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శాసనమండలిలో సమాధానం చెప్పారు. కేంద్రానికి మాత్రం రాష్ట్రంలో సుమారు 50వేల పై చిలుకు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పాఠశాల విద్యాశాఖ నివేదిక పంపింది. రాష్ట్రంలో సుమారు 14వేల వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఒక్క టీచరే అన్ని తరగతులకూ బోధించడం ఉపాధ్యాయులకు భారంగా మారింది. ఈ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సెలవు పెడితే ఇక ఆ రోజు బడిని మూసివేయాల్సిందే. నెలరోజుల క్రితం పోస్టుల సంఖ్య చెప్పకుండా మెగా డిఎస్‌సిని త్వరలో విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స పేర్కొన్నారు. ఇప్పటి వరకు డిఎస్‌సిపై విద్యాశాఖ కసరత్తు చేయలేదు. మరోపక్క ప్రతి మండల కేంద్రంలో రిజర్వుడు టీచర్ల విధానం తీసుకొస్తామని చెబుతున్నారు. దీనిపై కూడా విద్యాశాఖ ఎలాంటి కసర్తు చేయడం లేదు. ప్రతి ఏటా నిర్వహించాల్సిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను కూడా ప్రభుత్వం నిర్వహించడం లేదు. గడిచిన ఐదేళ్లలో 2018, 2022లో మాత్రమే టెట్ నిర్వహించింది. పాఠశాల విద్యాశాఖ 2022లో నిర్వహించిన టెట్‌కు 5,25,789 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 4,07,329 మంది హాజరయ్యారు. వీరిలో 2.40 లక్షలు (58.07 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 2018లో నిర్వహించిన టెట్‌లో మరో 3 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. వీరితోపాటు ఉపాధ్యాయ విద్య పూర్తిచేసిన అభ్యర్థులు కూడా డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న డి.ఆదినారాయణ

విశాఖ ఉక్కుపై కేంద్రం దాడి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్రంలోని బిజెపి క్రూరమైన దాడి చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 878వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును రక్షించుకోవడానికి ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్మికుల ఐక్యతను దెబ్బతీసేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్రం ఆదేశం మేరకు కాంట్రాక్టు కార్మికుల వేతనాల్లో కోతలు విధించడం, శాశ్వత ఉద్యోగులకు వేతనాలు పెంచకుండా మొండిగా వ్యవహరించడం వంటి చర్యలకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పాల్పడుతుండడం తగదన్నారు. ఇటువంటి తరుణంలో ఐక్య పోరాటాలతోనే కార్మిక హక్కులను సాధించుకోగలమని తెలిపారు. దీక్షల్లో ఎన్ తాతారావు, మంత్రి రవి, జె రామకృష్ణ, కెఎస్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నిధులివ్వకపోతే ఉద్యమమే

- సర్పంచుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్తు బకాయిల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసుకోకుండా గ్రామ సర్పంచుల అకౌంట్లలో పూర్తి స్థాయిలో వేయాలని, లేనిపక్షంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమిస్తామని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్ పేర్కొన్నారు.

విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన విద్యుత్తు ఛార్జీల కింద నగదును తీసుకోవడం అనైతికచర్య అని అన్నారు. అఖిల భారత పంచాయతీ పరిషత్తు (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల సర్పంచులతో అనేకసార్లు కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌ను కలిసి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. గత మే నెల 15, 22 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం, ఆర్థికశాఖ అధికారులు నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేసి తాజాగా విద్యుత్తు ఛార్జీలకు రూ.336 కోట్లు సర్దుబాటు చేస్తున్నట్లు కమిషనరు సూర్యకుమారి చెప్పడాన్ని తాము తప్పుపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు పిఎఫ్ఎంఎస్ ద్వారా విడుదల చేస్తున్నట్లుగా ప్రొసీడింగ్స్‌లో తెలపడాన్ని ఖండిస్తున్నామన్నారు.

వాన్‌పిక్ భూములను తిరిగి పేదలకే ఇవ్వాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వాన్‌పిక్ కంపెనీ కోసం సేకరించిన అసైన్డ్ భూములను తిరిగి పేదలకే పంపిణీ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2008-09లో వాన్‌పిక్ ప్రాజెక్టు కింద నిజాంపట్నం, వాడరేవు, ఇతర పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం 25 వేల ఎకరాలను సేకరించిందని తెలిపారు. ఇందులో 13,221 ఎకరాల అసైన్డ్ భూములను దళితులు, బలహీన వర్గాలకు చెందిన పేదలకు ఎలాంటి నష్టపరిహారాన్ని చెల్లించకుండా ప్రభుత్వం దౌర్జన్యంగా తీసుకుని వాన్‌పిక్‌కు కట్టబెట్టిందన్నారు. పేద రైతుల నుండి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా దౌర్జన్యంగా భూములను తీసుకోవడాన్ని నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘంతో పాటు 26 ప్రజా సంఘాల ఆధ్వర్యాన భూములు కోల్పోయిన పేదలకు న్యాయం చేయాలని పెద్దఎత్తున ఆందోళనలు చేశామని తెలిపారు. ఈ భూముల్లో అక్రమాలు జరిగాయని 2014లో ఇడి స్వాధీనం చేసుకుందన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత ఈ భూములకు ఇడితో సంబంధం లేదని తాజాగా తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆ భూములను తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూసేకరణ సందర్భంగా ఎలాంటి పునరావాస పథకాన్ని అమలు చేయనందున తక్షణం ఆ భూములను తిరిగి దళితులు, బలహీన వర్గాలవారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బిసిలకు రక్షణగా ఉంటా..!

- టిడిపి నేత నారా లోకేష్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం జరిగిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బిసిలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని బంగారుపాళెం నుంచి ప్రారంభమై వడ్డిపాలెం, జువ్వలదిన్నె, చిప్పలేరు, ఆదినారాయణపురం, అన్నగారిపాలెం, మామిళ్లదొరువు, పూలదొరువు మీదగా తుమ్మలపెంట వరకు సాగింది. బంగారుపాళెంలో బిసి సామాజిక తరగతి ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మత్స్యకారులకు ఎటువంటి సాయమూ అందలేదని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ఆక్వా రంగాన్ని జగన్ దెబ్బతీశారన్నారు. రజకులను వైసిపి ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది టిడిపి పాలనలోనేనని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. బిసి సబ్‌ప్లాన్, కార్పొరేషన్ ద్వారా బిసిలకు రుణాలు ఇచ్చామని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి తగ్గించిన స్థానిక సంస్థల బిసి రిజర్వేషన్లు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచుతామన్నారు. అందుకు సంబంధించిన జిఓ 217ని టిడిపి అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లోనే రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదులతో అప్రమత్తంగా ఉండాలి

- సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

వచ్చే ఎన్నికలలోపు ప్రజల దృష్టిని మళ్లించి, ఓట్లు దండుకొనేందుకు మతోన్మాదశక్తులు కుట్రలు చేస్తాయనీ, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ హెచ్చరించారు. 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మోడీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయన్నారు. బిల్కిస్‌బాను కేసు సహా పలు అంశాలను ఆమె ఉదహరించారు. గడచిన తొమ్మిందేళ్లలో దేశంలో నిరుద్యోగం, ధరలు ఆకాశమంత ఎత్తు ఎదిగాయనీ, వాటిని నియంత్రించడంలో మోడీ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లపై కూర్చుని, కట్టెల పొయ్యిలో పొగ గొట్టాలను ఊదుకొనే పరిస్థితి కల్పించారని ఎద్దేవా చేశారు. అధికారం కోసం ప్రజల మధ్య అసమానతలు, ద్వేష భావాన్ని పెంచి పోషించే దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. దేశానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన మహిళా రెజ్లర్ల డిమాండ్లను పరిష్కరించడంలో మోడీ సర్కారు నిర్లక్ష్యంగా, నిర్దయగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిజ్‌భూషణ్‌ను ఎందుకు అరెస్టు చేయట్లేదని ప్రశ్నించారు. ఓట్లు దండుకోవడానికి వచ్చే నేతలకు ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో 30 వేల మంది ఆడపిల్లల అదృశ్యం

- వలంటీర్ వ్యవస్థే కారణం
- పన్నులు వేసే జగన్‌కు.. దోపిడీదారునికి తేడా లేదు : పవన్‌కల్యాణ్

ఏలూరులో అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రంలో 30 వేల మంది ఆడపడుచులు అదృశ్యమైనట్లు నేషనల్ క్రైం బ్యూరో లెక్కలు చెబుతున్నాయని, దీనికి వలంటీర్ వ్యవస్థనే కారణమని సెంట్రల్ అధికారులు చెబుతున్నారని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. రెండోవిడత వారాహి యాత్రలో భాగంగా ఆదివారం పవన్ ఏలూరులో పర్యటించారు. ఏలూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాతబస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 30 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమైతే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కనీసం ఒక సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదని విమర్శించారు. దీనిలో 14 వేల మంది ఆడపిల్లలు తిరిగొచ్చినట్లు పోలీసులు చెబుతున్నా మిగిలిన ఆడపిల్లలు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వలంటర్ పరిధిలోని ఇళ్లలో ఎంతమంది ఆడపిల్లలు ఉన్నారు? వారి పరిస్థితి ఏమిటి అంటూ వివరాలను వలంటీర్ల నుంచి అసాంఘిక శక్తులు సేకరించి ఆడ పిల్లలను అపహరిస్తున్నారని తెలిపారు. దీని వెనుక వైసిపి నాయకుల హస్తం కూడా ఉందని ఆరోపించారు. సిఎం పదవికి అర్హతలేనివాడు జగన్ అని అన్నారు. నాలుగేళ్ల పాలన అస్తవ్యస్తంగా ఉందని విమర్శించారు. 2021-22 కాగ్ నివేదిక ప్రకారం రూ.లక్షా 18 వేల కోట్లు ఏమయ్యాయో తెలియకుండా పోయిందన్నారు. రోడ్లు లేవు, ఉద్యోగాలు లేవని విమర్శించారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, ఎమ్మెల్యేలు మాత్రం రూ.వందల కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఎపి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు రూ.4,754 కోట్లకు సంబంధించి లెక్కలు లేవన్నారు. ఆరోగ్యశ్రీ సరిపోదని, ప్రభుత్వ ఆస్పత్రులను చంపొద్దన్నారు. క్లాస్ వార్ అంటే పేదలను దోచుకోవడమా? అని ప్రశ్నించారు.

స్మార్ట్‌ఫోన్ కొంటే టమాటాలు ఫ్రీ

మధ్యప్రదేశ్ : పెరిగిన టమాటా ధరలను తనకు అనుకూలంగా మార్చుకున్నాడో మధ్యప్రదేశ్‌లోని యువకుడు. తన సెల్‌ఫోన్ షాపులో స్మార్ట్‌ఫోన్ కొంటే.. 2 కిలోల టమాటాలు బహుమతిగా ఇస్తామని విచిత్ర ఆఫర్‌ను ప్రకటించాడు. అశోక్‌నగర్ పట్టణంలో అశోక్ అగర్వాల్ అనే యువకుడు సెల్‌ఫోన్ దుకాణం నడుపుతున్నాడు. స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసిన వారికి 2 కిలోల టమాటాలు బహుమతిగా ఇస్తానని వెల్లడించాడు. ఈ విషయం తెలుసుకున్న వినియోగదారులు ఆ దుకాణానికి వరుస కడుతున్నారు. ఈ ఆఫర్ వల్ల కస్టమర్ల సంఖ్య పెరిగిందని.. స్మార్ట్‌ఫోన్లు కూడా ఎక్కువగా అమ్ముడయ్యాయని అశోక్ సంతోషం వ్యక్తం చేశాడు.

నత్తనడకన నాడు-నేడు రెండో దశ

- నిధులు మంజూరులో జాప్యం
- గత 3 నెలల్లో రూ.255 కోట్లే మంజూరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మన బడి నాడు-నేడు రెండో దశ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2021లో చేపట్టిన పనులు ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. 22,266 పాఠశాలల్లో రెండో దశ నాడు-నేడు కింద మౌలిక వసతులు, అదనపు తరగతి గదులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే వీటిల్లో 22,220 పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ అనుమతులు ఇచ్చింది. వీటిలో 22,152 పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఈ పాఠశాలల్లో 9 రకాల పనులకు మొత్తం రూ.7,983 వేలకోట్లతో అంచనా వేసింది. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఏప్రిల్ 9 నాటికి రూ.2,544 కోట్లు పాఠశాల విద్యాశాఖ మంజూరు చేసింది.

గడిచిన మూడు నెలల్లో కేవలం రూ.255 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. ఏప్రిల్ 9 నాటికి రూ.1,768 కోట్ల పనులు పూర్తవ్వగా, ఇప్పటికి రూ.2,781 కోట్ల పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.5,202 కోట్ల పనులు పూర్తికావాల్సి ఉంది. పాఠశాలలు ప్రారంభం నాటికే పూర్తికావాల్సిన పనులు ఇప్పటికీ పూర్తికాలేదు.

బడులు ప్రారంభించిన సమయంలో కొంత మేర పనులు జరిగాయి. ఇప్పుడు నిధులు లేకపోవడంతో అవి నిలిచిపోయాయి. సిఎం సొంత నియోజకవర్గం పులివెందులలోని బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీరు, ఫర్నీచర్, రంగులు వేసేందుకు రూ.7.15లక్షలతో అంచనా వేశారు. ఇప్పటి వరకు ఒక్క పని కూడా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో నాడు-నేడు పనులను డిసెంబరు-జనవరి నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి శనివారం పాఠశాల విద్యపై నిర్వహించిన సమీక్షలో చెప్పారు. సివిల్ పనులు ఇంత వరకు 38శాతం పూర్తయ్యాయని, మొత్తం పనులను డిసెంబరు నాటికి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ మౌలిక సదుపాయాల కమిషనరు భాస్కర్ పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను తరలించిన ఉన్నత పాఠశాలల్లో గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు పాఠశాలల పని వేళల్లో నిర్మాణ పనులు జరగడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. అలాగే నిధులు విడుదల చేయకుండా పనులు సకాలంలో ఎలా పూర్తి చేయాలని పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు, ప్రధానోపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

రెండో దశలో పనుల వివరాలు

జిల్లా	మొత్తం పాఠశాలలు	పనులు ప్రారంభమైనవి	మంజూరైన నిధులు	ఖర్చు చేసిన నిధులు
అల్లూరి	967	950	230	68
అనకాపల్లి	605	601	257	91
అనంతపురం	1102	1099	386	131
అన్నమయ్య	1037	1033	348	113
బాపట్ల	544	541	192	74
చిత్తూరు	1210	1210	451	166
తూర్పుగోదావరి	670	666	270	98
ఏలూరు	883	881	294	110
గుంటూరు	562	561	207	81
కాకినాడ	896	896	346	119
అంబేద్కర్	771	768	257	84
కృష్ణా	488	487	181	64
కర్నూలు	1074	1074	527	188
మన్యం	535	531	145	46
నంద్యాల	972	972	364	109
ఎన్‌టిఆర్	596	594	241	93
పల్నాడు	904	903	308	119
ప్రకాశం	977	973	427	160
నెల్లూరు	1378	1374	479	174
సత్యసాయి	1102	1100	335	109
శ్రీకాకుళం	1094	1084	448	146
తిరుపతి	1068	1068	372	113
విశాఖపట్నం	317	315	125	48
విజయనగరం	738	737	231	81
పశ్చిమగోదావరి	731	729	256	90
కడప	1005	1005	297	106
	22,226	**22,200**	**7983**	**2789**

IKF Home Finance Limited
IKF Home Finance
Regd. Off.: 40-1-144, 1st Floor, Corporate Centre, M.G. Road, VIJAYAWADA, AP - 520010
CIN: U65922AP2002PLC039417 **Phone:** 866+2474644, 2474633 **Fax:** 0866+2485755
Email: cs@ikfhomefinance.com **Web:** www.ikfhomefinance.com

NOTICE

SHORTER NOTICE is hereby given that the 21st Annual General Meeting of IKF Home Finance Limited will be held on Tuesday, the 11th day of July 2023, at the Registered Office of the Company situated at # 40-1-44, Corporate Centre, M.G. Road, Vijayawada - 520 010, Andhra Pradesh, India at 02.00 P.M.

Notice of the meeting setting out the ordinary & special business to be transacted there at has been sent to the members to their registered address by post and electronically to those members who have registered their e-mail addresses. Members are hereby informed that the notice of the meeting and the aforesaid documents are available on the Company's website (www.ikfhomefinance.com) and copies of the said documents are also available for Inspection at the Registered Office of the Company on all working days during business hours up to the date of the Annual General Meeting.

Pursuant to the provisions of the Companies Act, 2013 read Applicable Rules, 2014 and SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015.

The Notice of the AGM is available on the website of the Company and also on website of CDSL.

For and on Behalf of the Board
IKF Home Finance Limited
Sd/-
Place: Vijayawada **(Vishal Kumar Joshi)**
Date : 08/07/2023 Company Secretary & Compliance Officer

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువడమైనది)
CIN : L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హర్రింగ్‌టన్ రోడ్, చెట్‌పట్, చెన్నై-600031.
Tel : +91 44 4564 4000 | Fax: +91 44 4564 4022
IDFC FIRST Bank

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు.

ఏదైతే ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువడమైనది) నుంచి దిగువ తెలిపిన రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు దిగువ తెలియపరిచిన సెక్యూర్డ్ లోన్స్‌ను తీసుకొని ఉన్నారు. రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతలు వారు వారి యొక్క ఆస్తులను తనఖా పెట్టి లోన్‌ను తీసుకున్నారు. వారు వారి యొక్క లోన్ అగ్రిమెంట ప్రకారం ఉన్న నియమాలు మరియు నిభందనలు పాటించడంలో విఫలమైనారు మరియు వారి యొక్క లోన్‌ను ఆర్‌బిఐ గైడ్ లైన్స్ ప్రకారం ఎన్‌పిఏ లుగా వర్గీకరించబడినాయి. వారు సదరు (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువడమైనది) బ్యాంకు వారికి బకాయి ఉన్న మొత్తంను నోటీసులో జారీ చేయబడిన విధంగా దిగువ టేబుల్‌లో వివరింపబడ్డాయి మరియు బకాయిల మీద తదుపరి వడ్డీ కూడా ఉంటుంది మరియు అదే కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తెలిపిన తేదీలలో ఆమోదించబడతాయి.

క్ర. సం.	రుణ ఖాతా నెం.	రుణం రకం	రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలపేరు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బాకీపడిన మొత్తం	ఆస్తి చిరునామా
1	12736934, 12473589 & 33302906	ఆస్తి పై రుణం	1. ప్రకాష్ కేబుల్ టివి 2. గుర్రం రమాదేవి 3. సూర్య ప్రకాష్ గుర్రం	23.06.2023	INR 1,51,32,407.30	ఆస్తి-1 : ఆంధ్రప్రదేశ్-520008, కృష్ణాజిల్లా, డో.నం.20-4-15 వద్ద, కృష్ణాజిల్లా, విజయవాడ డిఓ. సబ్ రిజిస్ట్రీ, డిఓ. రిజిస్ట్రేషన్ జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజయవాడ గ్రామ పార్టీషన్ మరియు కేదారేశ్వరపేట, ప్రతీక్ నగర్, వార్డు నం.14, బ్లాక్ నం.9 లో ఎన్.టి.ఎస్.నం.2,4 మరియు 6, బ్లాక్ నం.11లో ఎన్‌టిఎస్.నం.115, వార్డు నం.14 యొక్క బ్లాక్ నం.16లో ఎన్‌టిఎస్ నం.5, బ్లాక్ నం.15 లో ఎన్‌టిఎస్ నం.1 నుండి 5, 6/పి, 7/పి, 8 నుండి 19, 20/పి, 21/పి, 24, బ్లాక్ నం.11లో ఎన్‌టిఎస్ నం.1152, 1159, బ్లాక్ నం.10లో ఎన్‌టిఎస్ నం.60,61,62,64, బ్లాక్ నం.9లో ఎన్‌టిఎస్ నం.1302, యు.డి.ఎ. ద్వారా జారీ చేయబడిన రెవెన్యూ వార్డు నం.8 సంబంధిత ప్రస్తుత సర్వే నం.లు., బ్లాక్ నం.3, రెవెన్యూ వార్డు నం.8, ఎన్‌టిఎస్.నం.17/సి, సర్వే నం.106/3, 105, 113/2, 111/2, 112, 113/1, 114/1, 109, ఎన్‌టిఎస్ నం.15, సర్వే నం.101/1, 102/1, 104/3, ఎన్‌టిఎస్ నం.8 నుండి 10, 6/1, 6/2, పాత సర్వే నం.102, 102/2, 104/1సి లో ఉన్న "లోటస్ ల్యాండ్ మార్క్" గా తెలిసిన రివైజ్డ్ ఎల్.పి.నం.4/2006 ఎల్.పి.నం.11/2004 లో సి.కె.రెడ్డి రోడ్డు వైపు ముఖం, ప్లాట్ నం.5,6 మరియు 7 లో ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ పరిధిలో 56 చ.గ.లు. (46.82 చ.మీ.లు.) మొత్తం నుండి బయటకు సైట్ విస్తీర్ణం 2984 చ.గ.లు. (2494.62 చ.మీ.లు.) తో పాటు ఆనంద్ హైట్స్ యొక్క 4వ అంతస్తులో ఫ్లాట్ అందులో బేరింగ్ ఫ్లాట్ నం.వి-ఐ తో పాటు ప్లింత్ ఏరియా 1365 చ.అ.లు., పార్కింగ్ ఏరియా 100 చ.అ.లు., తో పాటు అన్నీ సౌలభ్య హక్కులు. ఉన్న హద్దులు : ఆనంద్ హైట్స్ యొక్క 4వ అంతస్తులో ఫ్లాట్ నం.బి-ఐ యొక్క సరిహద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్, ఉత్తరం: ఓపెన్ టు స్కై మరియు ఫ్లాట్ నం.వి-జె, దక్షిణం: ఓపెన్ టు స్కై. సైట్ యొక్క సరిహద్దులు: తూర్పు: సి.కె. రెడ్డి రోడ్డు (నూజివీడు రోడ్డు), పడమర: ప్లాట్ నం.4 మరియు 6, ఉత్తరం: ప్లాట్ నం.7 భాగం, దక్షిణం: ఆనంద్ నాయుడు మరియు ఇతరుల ఆస్తి. ఆస్తి-2 : అంశం-1 : ఆంధ్రప్రదేశ్-520008, కృష్ణాజిల్లా, కృష్ణాజిల్లా, విజయవాడ, విజయవాడ జిల్లా-రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విద్యాధరపురం యొక్క ఆర్.ఎస్.నం.132/2బి2 లో మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ పరిధిలో 250 చ.గ.లు. (209.03 చ.మీ.లు.) బేరింగ్ మూల్యాంకనం నం.11700ఎస్/10విఎల్‌టి, ఉన్న హద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: రోడ్డు, ఉత్తరం: గుర్రం రమాదేవి ఆస్తి, దక్షిణం: షేక్ రషీద్ ద్వారా ఇతరులకు విక్రయించబడిన ఆస్తి. అంశం-2 : ఆంధ్రప్రదేశ్-520008, కృష్ణాజిల్లా, విజయవాడ, విజయవాడ జిల్లా-రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విద్యాధరపురం యొక్క ఆర్.ఎస్.నం.132/2బి2 లో మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ పరిధిలో 520 చ.గ.లు. (434.78 చ.మీ.లు.) బేరింగ్ మూల్యాంకనం నం.11799ఐ/484ఎస్, ఉన్న హద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: రోడ్డు, ఉత్తరం: ఇతరుల ఆస్తి, దక్షిణం: షేక్ రషీద్ ఆస్తి.

మీకు తెలియజేయవలసినది ఏమనగా గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువడమైనది) కు బకాయిలను చెల్లించవలసిందిగా మరియు టేబుల్ లో చూపించిన దాని ప్రకారం కాంట్రాక్టువల్ రేటు ప్రకారం దాని యొక్క తేదీలతో పాటుగా ఇతర ఖర్చులు, చార్జీలు మరియు ఇతరమైనవి ఈ నోటీసు ప్రచురించిన 60 రోజులలోగా చెల్లించవలెను., ఒక వేళ మీరు గనుక చెల్లించడంలో విఫలమైనచో దిగువ సంతకదారుడు SARFAESI చట్టం యొక్క సెక్షన్ 14 మరియు సెక్షన్ 13(4) ప్రకారం గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువడమైనది) బ్యాంకు వారు వారి యొక్క ప్రక్రియ మొదలుపెడతారు. కనుక మీరు సెక్షన్ 13(13) ప్రకారం మీరు మీ యొక్క సెక్యూర్డ్ ఆస్తులను అమ్మడం/లీసు కు ఇవ్వడం గానీ లేదా ఇతర పనులు చేయడానికి మీకు అనుమతి లేదు.

సం/- అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా తెలిసినది, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో అమల్గామేట్ చేయబడినది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా తెలిసినది)

తేది: 10.07.2023
ప్రదేశం: విజయవాడ

తిరుమలలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో సందర్శకుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు సందర్శకులతో నిండిపోయాయి. శిలాతోరణం క్యూలైన్ బారులు తీరింది. శ్రీవారి దర్శనానికి ప్రస్తుతం దాదాపు 24 గంటల సమయం పడుతోంది. శనివారం 86,781మంది సందర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. 44,920 మంది తలనీలాలు సమర్పించినట్లు తెలిపారు. రూ.3.37కోట్ల హుండీ ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

బ్రేక్ దర్శనం రద్దు

శ్రీవారి ఆలయంలో ఈ నెల 17న సాలకట్ల ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని 11న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 11న బ్రేక్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. ఈ కారణంగా సోమవారం సిఫారసు లేఖలు స్వీకరించబడవని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.

తుది విజయం రాజధాని రైతులదే

- రైతు ఉద్యమ నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు
- 1300వ రోజుకు చేరిన ఉద్యమం

సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపి, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిని ఎవరూ కదల్చలేరని, రైతులదే అంతిమ విజయమని మాజీ ఎంపి, రైతు నాయకులు వడ్డే శోభానాద్రీశ్వరరావు ఉద్ఘాటించారు. అమరావతి ఉద్యమం 1300 రోజులకు చేరిన సందర్భంగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడం రైతు దీక్షా శిబిరంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సభలో శోభనాదీశ్వరరావు ప్రసంగించారు. అమరావతిని ఎవరూ కదల్చలేరని గతంలో తాను చెప్పానని, ఇప్పుడు కోర్టులు కూడా అమరావతికి అనుకూలంగా తీర్పులు ఇచ్చాయని గుర్తు చేశారు. సుప్రీం కోర్టులో కూడా అమరావతికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నానన్నారు. కోర్టు తీర్పులను లెక్క చేయకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మొండిగా ముందుకెళు న్నారని విమర్శించారు. మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రాజధాని నిర్మాణ నిర్ణయం, రైతులు 33 వేల ఎకరాలు ఇవ్వడం, ఉద్యమం, అరెస్టులు, నిర్బంధాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. జగన్ దుర్మార్గపు పాలనకు తెరపడాలంటే రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ అమరావతి అంశం ప్రధాన అజెండా కావాలన్నారు. రాష్ట్రాన్ని జగన్ భ్రష్టు పట్టించారని, ఆయన ఓడిపోతే జైలుకెళ్తారని దుయ్యబట్టారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి మద్దతుతోనే అమరావతి పట్ల వైసిపి దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, అమరావతికి అన్ని పార్టీలూ మద్దతుగా ఉన్నాయనే భ్రమలో ఉండరాదని అన్నారు. ఆర్-5 జోన్‌లో సెంటు స్థలం పంపిణీ పేదలపై ప్రేమ వల్ల కాదని విమర్శించారు. జగన్ రావాలా? పోవాలా? అనే అజెండాతో రానున్న ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ ఎనిమిది బడ్జెట్లలో నిధులు కేటాయించకుండా కేంద్రం అమరావతి పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు కేంద్రాన్ని నిలదీసే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అమరావతే రాజధానని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి మాట్లాడుతూ అమరావతి ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సభ ప్రారంభానికి ముందు అమరావతి అమరవీరులకు నివాళులర్పించారు. అమరావతి జెఎసి సమన్వయ కమిటీ సభ్యులు పువ్వాడ సుధాకరరావు, శివారెడ్డి, దళిత బహుజన పరిరక్షణ సమితి నాయకులు పి.బాలకోటయ్య, పి.చిన్నా, సిపిఐ జిల్లా కార్యదర్శి జె.అజయ్‌కుమార్, టిడిపి నాయకులు పి.మాణిక్యరావు, మైనర్‌బాబు, రజని, సిహెచ్.బసవయ్య, ఎస్.రాజేంద్రప్రసాద్, శారద, అడ్వకేట్ సిహెచ్.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్ భవనాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి శేషసాయి

కోర్టుల్లో వాదనలు.. మౌనం రెండూ ముఖ్యమే..

- హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి

ప్రజాశక్తి -నెల్లూరు

న్యాయవాద వృత్తిలో రాణించాలంటే బాగా వాదించడంతోపాటు సందర్భానుసారంగా మౌనంగా ఉండడం కూడా ముఖ్యమని రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి పేర్కొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోర్టు ఆవరణంలో నూతనంగా నిర్మించిన న్యాయస్థాన భవనాలను జిల్లా న్యాయమూర్తి జస్టిస్ డి రమేష్‌తో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ శేష సాయి మాట్లాడుతూ తక్కువ వ్యవధిలోనే భవన నిర్మాణాలను పూర్తి చేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటానికి కషి చేసిన వారికి అభినందనలు తెలిపారు. భవన నిర్మాణాల కోసం జిల్లా పరిపాలన న్యాయమూర్తి రమేష్ ప్రత్యేక శ్రద్ధపెట్టారని ప్రశంశించారు. న్యాయమూర్తుల మంచి తీర్పులు వస్తున్నాయంటే ఆయా న్యాయవాదులు మంచిగా వాదిస్తున్నారని అర్థమవుతుందన్నారు. బార్ అసోసియేషన్ బాగుంటేనే బెంచ్ కూడా బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి యామిని, జిల్లా ఎస్‌పి తిరుమలేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, బార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పడవలు బోల్తా

- ఇద్దరు మత్స్యకారుల మృతి
- ఒకరు గల్లంతు

ఢిల్లేశు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి, కవిటి

శ్రీకాకుళం జిల్లాలో రెండు పడవలు బోల్తా పడి ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. ఒకరు గల్లంతయ్యారు. మృతుల్లో గార మండలానికి చెందిన ఒకరు, కవిటి మండలానికి చెందిన ఒకరు ఉన్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... గార మండలం బందరువానిపేటకు చెందిన పుక్కళ్ల లక్ష్మయ్య (53), సుకల సూర్యనారాయణ, గుంటు తలసయ్య, దుమ్ము కన్నయ్య, చోడిపిల్లి సూరిబాబు, గుంటు గణపతిరావు కలిసి బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. అలల ఉధృతికి బోటు బోల్తా పడడంతో లక్ష్మయ్య మృతి చెందారు. గణపతిరావు గల్లంతయ్యారు. సూర్యనారాయణ, తులసయ్య, కన్నయ్య, సూరిబాబు ఈదుకుంటూ పోలాకి మండలం రాజారాంపురం వద్ద ఒడ్డుకు చేరుకున్నారు.

కవిటి మండలం కపాసుకుద్దికి చెందిన బడే ఢిల్లేశు(42), మైలపల్లి శ్యామ్ శేఖర్, మైలపల్లి శివ, బుడ్డ వీరయ్య, సూరాడ పేరయ్య కలిసి పడవలో చేపల వేటకు వెళ్లారు. సముద్రంలో కొంతదూరం వెళ్లేసరికి అలల ఉధృతికి వారి పడవ బోల్తా పడింది. దీంతో, పడవలోని నలుగురు మత్స్యకారులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. అలలతో పోరాడి ఢిల్లేశుకూడా ఒడ్డుకు చేరినా ఫలితం లేకపోయింది. అప్పటికే కడుపులోకి భారీగా ఉప్పు నీరు చేరడం, శ్వాస అందకపోవడంతో ఆయన ఒడ్డున మృతి చెందారు. ఈ రెండు కేసులను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతిది కృత్రిమ ఉద్యమం

- ఎంపి నందిగం సురేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని ఉద్యమం కేవలం చంద్రబాబునాయుడి బినామీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం జరుగుతున్న కృత్రిమ ఉద్యమమని వైసిపి ఎంపి నందిగం సురేష్ అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి ప్రాంతం రాజధానికి అనువైనది కాదని చంద్రబాబునాయుడుకు తెలిసే అన్ని తాత్కాలిక నిర్మాణాలను చేశారని అన్నారు. అమరావతిలో రియల్ ఎస్టేట్ తప్ప ఎలాంటి అభివృద్ధి లేదని విమర్శించారు. అమరావతిలో పచ్చటి పొలాలను నాశనం చేయవద్దని రైతులు వేడుకున్నా బలవంతంగా భూములు లాక్కుని రాజధానిని ఏర్పాటు చేశారని అన్నారు.

అమరావతిలో జరిగేది పెయిడ్ ఆర్టిస్టుల ఉద్యమం తప్ప ప్రజాఉద్యమం కాదన్నారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు చంద్రబాబునాయుడి కోసం కాకుండా దళితుల కోసం మాట్లాడాలని కోరారు.

పారిశ్రామిక పెట్టుబడులపై 12న కీలక నిర్ణయాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఈ నెల 12న జరిగే కేబినెట్ సమావేశంలో పారిశ్రామిక పెట్టుబడులపై కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖ నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒబెరాయ్ గ్రూపు గండికోట, తిరుపతి, భీమిలి ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టుల నిర్మాణానికి ముందుకు వచ్చిందని, దీనివల్ల రాష్ట్రంలో పర్యాటక రంగం మరింత విస్తరించనుందని తెలిపారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు అనూహ్యమైన అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. అల్లూరి జిల్లా అరకులోనూ త్వరలోనే ఒబెరాయ్ గ్రూపు కార్యకలాపాలు ప్రారంభించనుందని వెల్లడించారు. కడపలో డిక్సన్ కంపెనీ టివి స్క్రీన్‌ల తయారీని త్వరలోనే ప్రారంభించనుందని, తద్వారా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ ఏడాది మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో జరిగిన పారిశ్రామిక పెట్టుబడుల సదస్సు తర్వాత తాము ఏ మేరకు ఒప్పందాలు వస్తాయని చెప్పామో వాటికి వాస్తవ రూపం కల్పించనున్నామన్నారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. విశాఖపట్నం - చెన్నయ్, చెన్నయ్ - బెంగళూరు, బెంగళూరు - హైదరాబాద్ కారిడార్ల మధ్య పారిశ్రామిక అవసరాల కోసం 50 వేల ఎకరాల భూములను సిద్ధం చేశామని చెప్పారు.

ఆయుర్వేదాన్ని అల్లోపతిలో కలపడం అనైతికం

ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

ఆయుర్వేదాన్ని అల్లోపతిలో కలపడం అనైతికమని, దానిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణిధర్ అన్నారు.. బాపట్ల జిల్లా చీరాలలోని రామాపురంలో ఐఎంఎ 19వ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికృష్ణ మాట్లాడుతూ ఐఎంఎ అంటే ప్రయివేటు వైద్యుల సంఘం అనే అపోహ ఉందని, కానీ తమ సంఘం సభ్యులు ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో, వైద్య కళాశాలలో సేవలందిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యారోగ్య విధానాలను రూపొందించే సమయంలో ఐఎంఎను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆర్‌ఎంపిలు రోగులకు యాంటీబయాటిక్ డోసులు అధికంగా ఇస్తుండడంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వైద్యాన్ని ప్రభుత్వం అరికట్టాలని కోరారు. ఆయుర్వేదం, అల్లోపతి వైద్య రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలేగానీ, వాటన్నింటినీ ఒకే విధానంలోకి తీసుకురావడం సరికాదన్నారు. వైద్యులపై ఇటీవల కాలంలో అధికంగా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. వాటిని అరికట్టాలన్నారు. ఐఎంఎ జోనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ భవానీ ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీహరి,రాష్ట్ర ఐఎంఏ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఫణి ధర్, రాష్ట్ర ఐఎంఎ కోశాధికారి డాక్టర్ రవీంద్రనాథ్, రాష్ట్ర ఐఎంఏ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ జెసి నాయుడు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు మరో రికార్డు

- ఒక రోజులో ఒక షిప్పు ద్వారా అత్యధిక కంటైనర్ల హ్యాండ్లింగ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం పోర్టు అథారిటీ మరో అరుదైన ఘనత సాధించింది. ఒక షిప్పు ద్వారా ఒక రోజులో అత్యధిక కంటైనర్లను హ్యాండిల్ చేసిన రికార్డును సొంతం చేసుకుంది. 2021 డిసెంబర్‌లో విశాఖపట్నం పోర్టు పరిధిలోని కంటైనర్ టెర్మినల్‌లో ఒక నౌక నుంచి 3921 టిఇయుల కంటైనర్లను హ్యాండిల్ చేసి ఒక రోజు అత్యధిక కంటైనర్లను హ్యాండిల్ చేసిన ఘనతను ఈ పోర్టు సొంతం చేసుకుంది. ఎంవిఎంఎస్‌సి అల్లి 111 నౌక ద్వారా పోర్టు ఈ కంటైనర్లను హ్యాండిల్ చేసింది. తాజాగా ఈ నెల ఎనిమిదిన ఒక షిప్పు ద్వారా 4035 టిఇయుల కంటైనర్లను హ్యాండిల్ చేసి పాత రికార్డును తిరగరాసింది. ఎంఎస్‌సి గైడ 111 నౌక ద్వారా ఈ కంటైనర్లను హ్యాండిల్ చేసింది. ఈ ఘనతను సాధించిన టెర్మినల్ ఆపరేటర్, సిబ్బందిని పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం అంగముత్తు అభినందించారు.

పర్యాటకానికి 450 ఎకరాలు

- టూరిజం శాఖ ప్రతిపాదనలకు భూయాజమాన్య సంస్థ పచ్చజెండా
- అరకు, కడప జిల్లాల్లో పలు ప్రాజెక్టులు
- సాగర తీర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మాచర్ల జిల్లాలోని ఎత్తుపోతల జలపాతం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక రంగ ప్రాజెక్టులకు భారీ మొత్తంలో భూములను కేటాయించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు పర్యాటక శాఖ సమర్పించిన ప్రతిపాదనలకు రెవెన్యూ శాఖ అధ్వర్యంలోని 'భూ యాజమాన్య సంస్థ (ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ' పచ్చజెండా ఊపినట్లు తెలిసింది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం..మాచర్ల జిల్లాలోని నాగులావరంలో అతి పెద్ద మెగా టూరిజం ప్రాజెక్టు కోసం 250 ఎకరాల భూమి కేటాయించేవీలుంది. ఈ ప్రాంతంలోనే విలాసవంతమైన రిసార్ట్స్ నిర్మాణానికి మరో 20 ఎకరాలు కూడా ఇవ్వాలని నిర్ణయించారు.

- రామాయపట్నం బీచ్‌లో సౌకర్యాల కల్పనకు 17.4 ఎకరాలు, తిరుపతి జిల్లాలోని తుప్పిలిపాలెంలో 3.2 ఎకరాలు, మొగల్తూరు మండలంలో బీచ్ రిసార్ట్స్‌కు 3 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదించారు.
- తిరుపతి జిల్లాలోని రాష్ట్ర సరిహద్దుగా ఉన్న తడ ప్రాంతంలో ప్రత్యేక పర్యాటాభివృద్ధికి 80 ఎకరాలు ఇవ్వాలని నిర్ణయించారు. కడప జిల్లా లెక్కలవారిపల్లిలో ఇంటిగ్రేటెడ్ పర్యాటక అభివృద్ధి కోసం 50 ఎకరాలు, అరకులోయలోని గ్రామాల్లో పర్యాటకాభివృద్ధి పేరిట 60 ఎకరాలను కేటాయించాలని ప్రతిపాదించారు.
- పశ్చిమ గోదావరి జిల్లాలోని మొగల్తూరు మండలంలో బీచ్ రిసార్ట్‌కింద మూడు ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల మండలంలోని పొన్నాడలో టూరిజం పార్క్ ఏర్పాటుచేసేందుకు, విశాఖ జిల్లాలోని ఎండాడ, విశాఖ పట్టణంలో బీచ్ రిసార్ట్‌లకు ఎనిమిది ఎకరాలు, మధురవాడలో బీచ్ రిసార్ట్‌లకు 10 ఎకరాలు, భీమిలి మండలం నేరెళ్లవలసలో 1.8 ఎకరాలను కేటాయించాలని నిర్ణయించారు. ప్రకాశం జిల్లాలోని అన్నంగి, పాకాలలో పర్యాటకాభివృద్ధికి 28 ఎకరాలు కేటాయించనున్నారు.
- నంధ్యాల జిల్లాలోని వాల్మీకి గుహల ప్రాంతంలో పర్యాటకానికి 26.5 ఎకరాలు, అదే జిల్లాలోని బేతంచర్ల ప్రాంతంలో ఉన్న బిల్లసుర్గం గుహల పర్యాటకానికి మరో 21 ఎకరాలు కేటాంచనున్నారు. త్వరలోనే పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టులను రూపొందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

శ్రీకాళహస్తి ప్రమాదంపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి సమీపంలోని లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ వాసులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంపై ఆదివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

బోధన రెండు మీడియాల్లో నిర్వహించాలి

- ఎపిటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల్లో విద్యా బోధన, పరీక్షలను మాతృభాషతో పాటు ఇంగ్లీష్‌లో నిర్వహించాలని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి డిమాండ్ చేశారు. 1 నుంచి 9వ తరగతి వరకు కేవలం ఇంగ్లీష్‌లో నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి చెప్పడం సరికాదన్నారు. ఎపిటిఎఫ్ కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక సబ్జెక్టు నుంచి మరో సబ్జెక్టుకు కన్వర్షన్‌ను బలవంతంగా ఉపాధ్యాయులతో ఇప్పించడాన్ని ఖండించారు. వెంటనే దీనిని ఆపాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో విల్లింగ్‌తో కూడిన కన్వర్షన్స్ చేపట్టాలని కోరారు. డిఎస్‌సి-1998, 2008 ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలను తక్షణమే చెల్లించాలన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తక్షణమే 25 వేల పోస్టుల భర్తీకి నూతన డిఎస్‌సి వేయాలన్నారు. సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ఉద్యమాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఫెడరేషన్ సహాధ్యక్షులు దిలీప్ కుమార్, కార్యదర్శులు ధనుంజయరావు, నగిరి శ్రీనివాసులు, అదనపు కార్యదర్శి చెంగల్రాయ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై వేగంగా అడుగులు

- నియోజకవర్గ స్థాయిలో సమీక్షకు నిర్ణయం
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి బాధ్యతలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగిరపర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు నియోజకవర్గాల వారీగా సంబంధిత ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, నియోజకవర్గానికి చెందిన అధికారులతో ఈ నెలలో సమీక్షా సమావేశాలు జరపాలని ప్రభుత్వం అన్ని జిల్లాలకూ సర్క్యులర్ జారీ చేసింది. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు రూపొందించిన అజెండాల ప్రకారం ఈ సమీక్షలు జరపాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రతి నియోజకవర్గంలో గత నాలుగున్నర సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి పనులు, రాబోయే ఆరు నెలల కాలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు తదితర అంశాలపై ఈ సమావేశాల్లో సమీక్షించనున్నారు. జిల్లా సమీక్ష కమిటీ (డిఆర్‌సి) సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నా, నియోజకవర్గ స్థాయిలో పనులపై సమీక్షలు లేవు. ఈ నేపథ్యంలో ఈ సమీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. రాబోయే ఆరు నెలల్లో తక్షణం పూర్తి చేయగలిగిన పనులకు మాత్రమే ఆమోదం తెలపాలని నిర్ణయించారు. నిధులు లేక ఆగిపోయిన పనులు, నిధులున్నా జరగని పనులు, ప్రజలకు అత్యవసరంగా పూర్తి చేయాల్సిన పనుల గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. తక్షణం చేపట్టాల్సిన పనులపై నియోజకవర్గాల సమావేశంలో నిర్ణయం తీసుకొని వాటిని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి మంత్రులు దిశానిర్దేశం చేయనున్నారు. గత ఏడాది కాలంగా గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో తక్షణ అవసరాల కోసం సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించారు. వీటిని కొన్ని నియోజకవర్గాల్లో పూర్తిగా ఉపయోగించుకోగా, మరికొన్ని నియోజకవర్గాల్లో పనులు మందగమనంగా సాగుతున్నాయి. సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయిలో ప్రజలకు అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు మరికొంత నిధులు అవసరమని పలువురు ఎమ్మెల్యేలు కోరుతున్నారు. ముఖ్యమంత్రి వివిధ నియోజకవర్గాల్లో పర్యటించిన సందర్భంలో ఇచ్చిన హామీలు రాష్ట్ర వ్యాప్తంగా చాలా వరకు అమలు కాలేదని ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని నిర్ణయించారు. సిఎం హామీల అమలుకు యుద్ధప్రాతిపదికన అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపి వీటిని రాబోయే ఆరు నెలల్లో పూర్తి చేయించాలని లేదా పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు అందాయి.

అధిక ధరలతో జనజీవనం అస్తవ్యస్తం

టిడిపి ప్రధాన కార్యదర్శి శిరీష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారని టిడిపి ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పేర్కొన్నారు. ఏం కొనేటట్లు లేదు, తినేటట్లు లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అధిక ధరలు, ప్రభుత్వం వేసిన సకల పన్నులు ప్రజలకు పెనుభారంగా పరిణమించి వారి జీవితాల్లో గాడాంధకారం అలుముకొన్నదని అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను గమనిస్తే ఖరీఫ్‌లో కూడా కూరగాయల పంటలు దిగుబడి పెరుగుతుందని ఆశించడం అత్యాసే అవుతుందని తెలిపారు. బాధ్యత లేని సిఎం జగన్‌కు జనం బాధలు పట్టడం లేదని విమర్శించారు. ధరలపై ఏనాడూ సమీక్షించ లేదని అన్నారు. ధరలను తగ్గించే ప్రయత్నం చేయాలని కోరారు.

జగన్ అధికారంలోకి వచ్చినప్పట్నుంచి రాష్ట్రంలో వివిధ కులాలపై దాడులు అధికమయ్యాయని టిడిపి అధికార ప్రతినిధి మోకా ఆనంద్ సాగర్ విమర్శించారు. జగన్ వ్యూహం, పద్ధతి అంతా దళితులను పీడించడమేనని టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు.

విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా భూపతిరాజు రవీంద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూపతిరాజు రవీంద్రరాజు

ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ (విఆర్‌ఒ)ల సంఘం నూతన అధ్యక్షులుగా భూపతిరాజు రవీంద్రరాజు తిరిగి ఎన్నికయ్యారు. విజయవాడలోని గాంధీనగర్ ఫిలిమ్ ఛాంబర్‌లో రాష్ట్ర విఆర్‌ఒల సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఎన్నికల అధికారిగా ఎపి సర్వేయర్ల సంఘం అధ్యక్షులు ఆర్ చిరంజీవి వ్యవహరించారు. ఎన్నికైన కమిటీ మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతుంది. అసోసియేట్ అధ్యక్షులుగా బాలాజీరెడ్డి, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, మురళీ, వెంకట్రామిరెడ్డి, రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం అప్పలనాయుడు, సంయుక్త కార్యదర్శులుగా బెంజిమన్, బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా చైతన్య, హేమలత, తాడికొండ శ్రీనివాసరావు, ప్రసాదరావు, భవానీశ్రీ అనూష, కోశాధికారి మౌలాలీబాషా, స్పోర్ట్స్, ప్రచార కార్యదర్శిగా బాపూజీ ఇసి మెంబర్స్‌గా జి శ్రీనివాసరావు, కె స్వామి నాయుడు, బి శ్రీనివాసరావు, ఎం అప్పలనాయుడు, ఇ ప్రభాకర్, అడపా రాంబాబు, సిహెచ్ మనోజ్‌కుమార్, ఆర్ తిరుపతిరెడ్డి, టి సురేష్‌బాబు, కడియం రాజు, ఆర్ నరసరాజు, ఎస్ రమేష్, కె వెంకటగణేష్, సర్వేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక అనంతరం విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు మాట్లాడుతూ విఆర్‌ఒల సమస్యల పరిష్కారానికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రెవెన్యూశాఖలో 15,004 మంది విఆర్‌ఒలు ఉండగా, రెవెన్యూ ఉద్యోగులు 2 వేల మందే ఉన్నారని, క్యాడర్ స్ట్రెంగ్త్ ప్రకారం 60:40 నుంచి 30:70 నిష్పత్తిలోకి పెంచాలని, ఈలోగా మొత్తం ఖాళీలను విఆర్‌ఒలనే సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించాలని ఇప్పటికే రెవెన్యూ మంత్రిని కోరామని, సమస్య ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రేడ్-1, గ్రేడ్-2 విఆర్‌ఒలందరికీ డిడిఒగా తహశీల్దార్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో డిప్యూటీ తహశీల్దార్లు పొందుతున్న వేతనాలను మన రాష్ట్రంలో విఆర్‌ఒలకు కూడా వర్తింపజేయాలని భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర కమిటీ ఎన్నికల అధికారిగా ఎపిజిఇఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి సుగుణ, ఎలక్షన్ అబ్జర్వర్‌గా అసిస్టెంట్ రిజిస్టర్ కో ఆపరేషన్ డిపార్టుమెంట్ జి నాగసాయి, ఎపిజిఇఎ రాష్ట్ర కార్యదర్శి జి ఆస్కార్‌రావు, ఎపి రెవెన్యూ జెఎసి ఛైర్మన్ శ్రీవాస దివాకర్, ఎపిరెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర జెఎసి ఛైర్మన్ శ్రీవాస దివాకర్, రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లాల్ విద్యాసాగర్ హాజరయ్యారు.

"ఏ దేశంలోనైనా సంస్కృతి నిర్మాతలు ముగ్గురే! వారు :
1. శ్రమజీవులు,
2.శాస్త్రజ్ఞులు,
3. సాహిత్య కళాకారులు

– గోర్కీ

మనం చేయాల్సింది !?

అక్కడ కాసేది ఎండకాదు
అధికారం,

అక్కడి ఆకాశంలో విహరించేది
మదము మత్తు కలగలిసిన 'రొచ్చుమబ్బు'

బాకీపడ్డ చినుకులకోసం ప్రార్థించే చెమటపూలచెట్టు మీద
విసర్జనమలినజలాన్ని కురిపిస్తుందది నిర్లజ్జగా

అవమానం చెట్టుకి కాదు
తలవొంచుకోవాల్సింది చెట్టూ కాదు

అది సతత హరితఛత్రం,
దానికి తలవంపులేమిటి?

నేరం వర్షించిన మర్మావయానిదా?!
ఛీకొట్టాల్సింది విశాలనిర్మల వినీలాకాశాన్నా?!

నిందించాల్సిందీ.. నిలదీయాల్సిందీ
మూత్రమేఘాన్ని వెంటేసుకు తిరిగే పోకిరి గాలిపోగును

మూఢంలో ఉరుములహామీలతో ఆకాశాన్ని ఆవరించి
కార్తీకంలో పట్టుపీతాంబరాల్లా రెపరెపలాడుతుంటాయవి

చేసేది గర్జనల శుష్కవాగ్దానాలే తప్ప
జలధారల్ని వర్షించవుగాక వర్షించవవి

కాషాయవర్ణమేఘమాలను కాదు వానకోసం అర్థించాల్సింది,
కరిసమూహాల్లాంటి కారుమబ్బుల్ని

చెట్టుమొదట్లో మోకరిల్లాల్సిందెవరు?
మూత్రవర్షం కురిపించిన మదోన్మత్త పోకిరిమేఘం కదా!

మేఘాధిపతినని వొచ్చి కన్నీటితో కడగడమొక
నాటకమని
ప్రతిచెట్టుకీ పుట్టకీ రాయకీ రప్పకీ తెలుసును

అదొక ప్రచార పటాటోపం..అధికారార్భాటం
నాటకంలో కీలకమైన అంతర్భాగం

ఎప్పుడో ఒక సందెవేళ నారింజరంగులు వెలిసిపోతాయి
చీకటిపాలనకు తెరపడుతుంది

మనం చేయవలసిందల్లా
ఉచ్చమబ్బేదో.. వర్షమేఘమేదో గుర్తించడమే.

– లాంగుల్య

పోరాటం దిశగా...

ఇంకా ఆకలిగా వుంది
లోపల అన్నం పురుగు తొలిచేస్తోంది
తన ఎంగిలినే గుటకలుగా మింగుతున్నవాళ్ళకు
బడ్జెట్ కసువునుండి తాలుగింజలే రాలుతున్నాయి

ఆసుపత్రిలో ...
సూది మందు కావాలా, గోళీమందు కావాలా?
అనడిగితే కలిగే బీదల సందిగ్ధత
ఇన్నేసి భరోసాల్ని పట్టుకుని తీవ్రంగా కుదుపుతుంది
పేరుకే ముందడుగు
రాజ్యాంగం పునాదిపైన
ఏళ్ళనాటి అసంపూర్ణ ఇల్లు
ఇంటిలో పూతపూయని గోడొక దేశ ముఖచిత్రం
గదిలో అంటరాని కుండ
అయినా ఈ దేశాన్నీ, దుఃఖాన్నీ కలిపే ప్రేమిస్తున్నాం!

అందరూ ఆడుకుంటుంటే
మధ్యలో మొండాట ఆడి
అలిగి వెళ్ళిపోతే, అదే రాజ్యం
పోరాటం ఎక్కడ విస్తరిస్తుందోనని
మొక్కగానే పీకిపారేస్తే, అదే రాజ్యం
మొన్నొక బిల్కిస్ బానోకు
నిన్నొక బిల్కిస్ బానోకు
నేరస్తులు చేసిన గాయం కంటే
మానభంగానికి, మానవత్వానికి తేడా తెలీని
అత్యాచారానికి, కుజదోషానికి తేడా తెలీని
వ్యవస్థ చేసిన గాయానిదే నొప్పెక్కువ !

ఆధారంగా నమ్మించిన కొమ్మను
నమ్మి ఆనుకుంటాం
పెట్టుకున్న నమ్మకం
మరో పుచ్చుకొమ్మగా విరుగుతుంది
మన బలహీనత వారి ఒరలోని కత్తి
అది గాయపరచడాన్ని రుచి మరిగింది

ఒక హిమానీనదంలాగా
పైకి కనిపించని కదిలికేదో కదులుతూనే వుంది
కాని మన పోరాటాలేవో లావాలా విస్ఫోటించాలి
ఇన్నాళ్ళూ ఎవరికోసమో నిచ్చెన మోసింది చాలు
కాడికి తలవంచింది చాలు
భుజాలు కాయగాచింది చాలు
దేశస్థుడి ముఖం మూత్రంతో తడిచింది చాలు
కన్నీటికీ మూత్రానికి తేడా తెలీనివారి ముందు
కంటిచెమ్మ, కలకున్న కవచాన్ని తుప్పు పట్టిస్తుంది!

– శాంతయోగి యోగానంద
9110770545

ఉచ్ఛ జలధి తరంగం

వాడికది రోజువారీ
అలవాటులా ఉచ్ఛ పోస్తున్నాడు
ఈ దేశ మూలవాసీ ముఖంపై

తనకెవడేం చేయలేడని తన మొల చుట్టూ వున్న
జంధ్యం వాడికా ధైర్యాన్నిస్తోంది
కులమనే అహంకారం వాడికా
స్వేచ్ఛనిస్తోంది
దేవుడి ముఖంలోంచి
పుట్టుకొచ్చాననే గర్వం వాడి
శిశ్నం చుట్టూ ఉక్కు కవచమయింది

పొగరు బోతుతనానికి
ఏలిన వారి ఏభై ఆరు అంగుళాల ఛాతీ
రక్షణ కవచమయింది

నెత్తిన ఎగిరే కాషాయ జెండా
ఈ దేశం వాడొక్కడి జాగీరుగా
వాడి కళ్ళలో విషపు నాగులా
బుసలు కొట్టిస్తోంది !

చట్టమెప్పుడూ తన చుట్టమనే
నమ్మకాన్ని వమ్ము చేయని
ప్రభుత ఆడే డ్రామాలో
మునిగిపోయింది మేధావితనం

ఇంక వాడి ఉచ్చే
ఈ దేశ శిఖరాగ్రం నుంచి
నీపై, నాపై పడే పవిత్ర జలం
రండి దోసిళ్ళతో
తాగి పెడదాం ...!

– కెక్యూబ్ వర్మ

కళింగాంధ్ర 'అస్తిత్వ వాచకం'

సమీక్ష

ఒడ్డున పడినా, ఎండిన చెఱువు అట్టడుగు పొరల్లో మట్టికొట్టుకుపోయినా, చైతన్యరహితమౌతుంది చేప. కవిత్వం కూడా అంతే! తేటనీటిలో మిలమిల మెరుస్తూ కదలాడే చేపలా కవిత పాఠకుణ్ణి ఆకర్షించాలి. అలాంటి మిలమిలల చేపల్ని పుస్తకాల ఎక్వేరియాల్లో పెట్టి ప్రదర్శించడం బాల సుధాకరమౌళికి అలవడిన విద్య. కేంద్ర సాహిత్య అకాడమీ యువసాహిత్య పురస్కారం పొందిన మౌళి ... నిరంతరం కవిత్వ శిఖరాన్నధిరోహిస్తూనే ఉన్నారు. ఏకకాలంలో రెండు మూడు పడవల ప్రయాణం లక్ష్యసాధనకు పనికిరాదన్న ఎరుకతో కవిత్వాన్ని మాత్రమే శ్వాసిస్తున్నారు. 2014 నుంచి 8 కావ్యాలను తీసుకొచ్చి ఈ 'అస్తిత్వవాచకం'ను 9వ సంపుటిగా ముద్రించుకున్నారు.

'కొత్త విలువల విత్తనాలను నాటి నీళ్ళు పోసి/ పెంచి పెద్ద చేద్దామనే ఇద్దరం ఒక గూటి పిట్టలయ్యాం' ఈ వాక్యంతో ప్రారంభించిన కావ్యంలో తొలి కొన్ని కవితలు తమ నూత్న దాంపత్యానికి చెందిన అనుభూతులు, ఆశలు, ఆశయాలతో నిండి ఉన్నాయి. ఆ తరువాత పిల్లలు, బడులు, ఆడపిల్లల సమస్యలు, సమాజం స్త్రీలు, అల్ప సంఖ్యాకుల మీద చేస్తున్న దౌర్జన్యాలపై రాశారు. ఆయా వర్గాలకు ధిక్కారాన్ని నేర్పారు. ఆ వరసలోనే 'ఒక విధ్వంస స్వరం' అనే కవితలో 'దున్నపోతు లాగ పొద్దెక్కిందాకా నీ ఇష్టానికి తొంగోని/ వొల్లు ఇరుసుకొని లెగిత్తే/ నీ మూతికాడికి గిన్ని అందించాలి రా/ లం కొడకా' అని ఇంటికొచ్చి హింసిస్తున్న భర్తను భరించలేని భార్య చేత దులిపిస్తారు. ఋతు బాధలపై సానుభూతి ప్రకటిస్తూ 'సమస్త స్త్రీల నెలసరి బాధని ఇంకించు కోవడానికి/ ఇప్పటికిప్పుడే స్త్రీగా మారిపోవాలనుంది పాపా!' అంటాడు 'ఇట్లు మీ నాన్న' కవిత ముగిస్తూ! 'అంతిమ పరిష్కారం' కవితలో 'బడంటే సున్నిత సుకుమార హృదయాల పిల్లలు మేల్కొనే అమ్మ ఒడి' అని భావిస్తాడు. 'చివరి అంకం'లో 'అరచేతుల్లో కుద్దురుగా ఒదిగి అమిరిన పుస్తకం/ అనాథ బేల చూపులు చూస్తోంది. ఏడున్నర ఇంచీల తెర విరగబడి విరగబడి నవ్వుతోంది' పిల్లల దృష్టి పుస్తకం మీది నుండి సెల్ ఫోన్ల మీదికి మరలే సన్నివేశాన్ని హృదయానికి దగ్గరగా రాశారు. 'మూలంలో లోపం ఉంది తల్లీ/ అది తెగినబల్లి తోకలా కదులుతుంది' ఈ 'అనేక రేవతిల కోసం' కవితలోని తెగిన బల్లితోక పోలిక అతి నవ్యం, అద్భుతం. 'కౌమారం పిట్టల మీద తప్పులు తేల్చి/ ఏహ్యత పెంచుకున్నంత కాలం/ నువ్ పిట్టల తరపునే మాట్లాడలేవు నిలబడలేవు/ వకాల్తా పుచ్చుకోలేవు' అంటూ కౌమారంలోని ఆశలను పెద్దలు గౌరవించాలని చెబుతారు.

'అస్తిత్వ వాచకం' కవిత ముగింపులో 'బతుకునే చెరిపేస్తానంటే/ నువ్వే గీతలు గీసినా చెరిపి తీరుతాను/ ఏ పీఠాలనైనా కూల్చే తీరుతాను' అని ధిక్కార స్వరాన్ని వినిపిస్తారు తెగేసి. రాజ్య దౌర్జన్యాన్ని 'అబద్ధాల పుట్ట' కవితలో 'రక్షక దళాలనూ న్యాయస్థానాలనూ/ నీ ఇలాకాలో గుంజకు కట్టేసుకుని/ తూతూ నిజాలను జపిస్తే మాత్రం/ తప్పు ఒప్పైపోదు' అంటూ ధిక్కరాన్ని కొనసాగిస్తారు. 'ఎన్నికల చెట్టు వయసు డెబ్బై ఏళ్ళు/ ఇంకెంతకాలం పట్టుకు వేలాడతావో జవాబు చెప్పే/ చేవ నీకు లేదని తెలుస్తుంది' అని 'అహంకారం చెట్టు'లో వ్యక్తం చేస్తారు. 'మొహర్రం ఏ విజయనగరం'లో 'శాంతి కపోతం ఎగురుతుంది/ కాషాయం కక్ష కట్టిన కాలంలో / సంకెళ్ళ దేశంలో' అని మైనారిటీలకు సాంత్వన పలుకుతారు కవితాత్మకంగా. 'హృదయంలో తడి ఆరిన వాళ్ళంతా/ అక్కడ తిరిగి ప్రాణం పోసుకుని/ వొక్కొక్కరూ నదుల్లా ప్రవహిస్తూ' అని ఎల్లోరా గుహల్ని ప్రశంసిస్తారు. 'అతను రావడం రావడమే/ స్వేచ్ఛ అజరామరమని గొంతెత్తి లోకమంతా/ చాటింపు వేస్తాడు' ఇలా జి.ఎన్.సాయిబాబా మూర్తిని ప్రతిష్టిస్తారు రెండు కవితల్లో! ఆ వరుసలోనే గురువు శివారెడ్డి, జర్రా అప్పారావు, మేడిపల్లి రవికుమార్, తెలుగు వెంకటేష్‌ల ఘన వ్యక్తిత్వాలను చిత్రించారిందులో! కొత్త కొత్త ప్రతీకలతో, అభివ్యక్తులతో వ్యక్తీకరిస్తారు.

ఇదంతా తొలి భాగం అనుకుంటే, చివరి పది పన్నెండు కవితలూ, పదునెక్కిన తన కలాన్ని, తన నేలలోకి ముంచి రాసినవి. అక్కడినుండి వాన, నది, చెట్టు కలగలిపే నాల్గు కవితలు రాశారు. వాటిని అనుసరిస్తూ 'నా పేరు చంపావతి' అని ఓ కవిత. చంపావతి దాటి వెళ్ళాక 'మా ఊరి కవితలు' పేరన ఊరి జనాన్ని, వారి వృత్తుల్ని, శ్రమను, చెమటను రాశారు. అక్కడితో ఆగితే మౌళిని చెప్పుకోవడమెందుకు? ఊరసెరువు, ఇక్కప్ప, సుమ్మ, పాటల తాత, మా బతుకు, గోసి, సుట్ట అని మరో ఆరు రాసి ఉత్తరాంధ్ర యాసను ఉయ్యాల్లో పెట్టి ఊపేరు. ఇవన్నీ తాను నివసించే నెల్లిమర్లను ఆనుకొని ప్రవహిస్తున్న చంపావతి, దాని ఇరుగు పొరుగు గ్రామాల్లోని రైతులు, వారిపై ఆధారపడి బతికే బతుకుల శ్రమ. చెమట చిత్రణ అన్నమాట. మొత్తంగా ఒక నదీ ప్రాంతపు అస్తిత్వం అనేకంటే కళింగాంధ్ర అస్తిత్వ కెరటాలివి అనడం సబబు.

ఈ కవి ఉత్తరాంధ్ర యాసను ఎంతలా పిడికిలి పట్టాడో ఈ కవితల్లో మచ్చు చూద్దాం. 'ఊర సెరువు' కవితలో "సలికాలం మాసెరువు/ కాలూ సేతులూ పొట్టలోకి ముడుసుకుని/ కూకున్న ముసిల్దానిలా ఉంది..', 'సూత్తే.. కళ్ళనిండా ఒకటే కన్నీలు.. తుడుసుకుందుమంటే కళ్ళు సెరువులు' ఈ పేరాల్లో వ్యక్తీకరణ అత్యాధునికం. పిడికిలి నిండా కళింగాంధ్ర యాసే! 'గోసి' కవితను ముగిస్తూ 'మా తూరుపు గెడకర్ర మీద/ రెపరెపల ఎగిరే అస్తిత్వపు జెండా/ మా గోసి!"– గోసిని కళింగాంధ్ర అస్తిత్వ జెండాగా ఎగరేస్తున్నారు.

'చలిపులి' అనేది ప్రబంధ కవుల భావన. దాన్ని అత్యాధునికంగా ఎలా ఉపయోగించుకున్నారో పొగచుట్ట వర్ణనలో! 'సలికాలమొత్తే సుట్టే మా ఊరిల బడిన/ సలి పులిని పొలిమేరలకు తగిలేసే దివిటీ' అంటారు. అదే సుట్ట కవితలో 'కమ్మకత్తంచులాటి మంచి నిగనిగల మజ్జానం' అంటారు. మధ్యాహ్నం ఎండ కమ్మకత్తి అంచులా తళతళలాడుతూ, తీవ్రంగా, దొరికితే పీక కోసేస్తానన్నట్టుందట! పోలిక కత్తి కదా!

ఈపాటికే ఈ చివరి కవితల్లో కళింగాంధ్ర రైతు కూలీల, శ్రామికుల సజీవ భాషను కవితలకొద్దీ ఒంపడాన్ని చదువుకున్నాం. విడిగా ఇక్కడి పలుకుబళ్ళు, నానుడులను చూద్దాం. నొల్లచెక్క (102), కారిపోలం (118), నిగడదన్ని, ఈడిసలు– ఇలిసిలు, కటిక్కర్ర (120), సెయిబారు కత, పదారేల గుంట 121), ఇద్దులాట (122), యాదస్తు, ఆదరువు, మునకాల (124), బొట్టి (127), అడ్డపొగ (130) ఈ చివరి రెండూ కళింగాంధ్ర యాసకు రెండు భుజకీర్తులు.

అంతేకాదు పైడితల్లి మామ (115), గొల్ల కిష్ట, బారికి అప్పన్న, నెయ్యిల పాపన్న (117) పైడీలు పెనిమిటి (118) ఇసరాపు ఇక్కప్ప (121) అచ్చియ్య తాత (127), కొట్టేడ పైడితల్లి, సిరప నరసమ్మ, సేపేని తమ్మయ్య (130), కునుకోల అప్పలసోమి (131) ... ఇలా మనం ఆ కవితలెంట నడుస్తుంటే అడుగడుగునా తారసపడే ఉత్తరాంధ్ర పల్లెజనం. వీళ్ళందరి సావాసంతోటే మౌళి ఈ అస్తిత్వ వాచకం మనముందు పెట్టగలిగేరు. కాదంటారా?

కన్నీళ్ళకు బదులు ఏడుపు నీళ్ళు (126) అనే కొత్త పదాన్ని సృష్టించారు. ఆమోదయోగ్యమైన పద సృష్టి భాషావేత్తలే చెయ్యగలరు. 'ఇలాకాల రాసిపెట్టుకున్న శిలాఫలకవాక్యం' అని 'తదుపరి హక్కు' కవితలోని వాక్యం అనుకోని శబ్ద సౌందర్యాన్నిస్తోంది కదూ! 'ఈ లోకానికి మోక్షంలేదు పాపా' (28)– మోక్షం ఉందా? గత తరం అంటించిన మోక్షాన్ని ఈతరం నవ్య కవులూ వదిలించుకోకపోవడం విడ్డూరం.

కవితా రచనలోను, పుస్తక ముద్రణలోనూ నూతనత్వాన్ని సాధించాలనే తపన ఉన్న బాలసుధాకర మౌళి ఈ కావ్యానికి తాను ముందుమాటలు రాసుకోలేదు. లబ్ధప్రతిష్ఠులైన ఇతరుల అభిప్రాయాలనూ పెట్టలేదు. అదంతా దాటివచ్చిన సంప్రదాయంగా భావించి ఉంటారు. అందమైన 55 కవితలతో, అట్ట ముందూ వెనుకా అంతా తానేగా ఈ పుస్తకంలో పొడకడతారు మౌళి.

కొత్త కొత్త వస్తుసముదాయాన్ని ఎంచుకొని, నవ్య దృక్పథంతో, నూత్నమైన అభివ్యక్తితో, నిరంతర తపనతో కవిత్వాన్నే రాస్తూ, చెయ్యి తిరిగిన రచయితగా మౌళి నిర్మితుడౌతున్నారు. తన దృష్టినంతా సమాజం వైపే సారిస్తూ, అన్యాయాలను, ఘోరాలను, రాజ్యహింసనూ ధిక్కరిస్తూ రాస్తున్నారు. యువకవు లెందరున్నప్పటికీ కళింగాంధ్ర అస్తిత్వం నేపథ్యంగా కొత్త దారుల్లో పయనిస్తున్న బాల సుధాకర మౌళి మున్ముందు గొప్ప లక్ష్యాన్ని చేరుకోగలరని ఈ కావ్యం చెబుతోంది. అస్తిత్వ వాచకం, బాలసుధాకర మౌళి, పుటలు– 134, వెల– రూ.150. దొరకు చోటు : 96764 93680

– గార రంగనాథం
98857 58123

తెలుగునాట నాటక పోషకులు ప్రజలే !

చీకటి పువ్వూ నాటకంలోని ఒక దృశ్యం

రంగస్థలం

జూన్ 12 నుంచి 15 వరకూ కాకినాడ దంటు కళాక్షేత్రంలో 110 సంవత్సరాల చరిత్ర కలిగిన ద యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్, కొత్తగా ఏర్పడిన కాకినాడ కల్చరల్ అసోసియేషన్ తోడ్పాటుతో తన మొదటి ఆహ్వాన నాటికల పోటీలను ఘనంగా నిర్వహించింది. ఈ పరిషత్‌లో ప్రదర్శించిన ఏడు నాటికలు 2022– 23 నాటికల సీజన్లో అత్యుత్తమ నాటికలుగా పేరు తెచ్చుకుని అనేక పరిషత్తుల్లో పలు బహుమతులు గెల్చుకున్నవే! ఆయా సమాజాల వారిని ఆహ్వానించి ప్రేక్షకుల మనసులను ఉల్లాసపరుస్తూ వర్తమాన సాంఘిక తెలుగు నాటికల గుణాత్మక ప్రదర్శనలను చూపించారు. కాకినాడ కల్చరల్ అసోసియేషన్ మొదటి ధమాకాతోనే తెలుగు నాటికల పరిషత్తులలో, కరెంట్ ట్రెండ్స్ అందులోని వైవిధ్యాన్ని 'జాతీయస్థాయిలో' అని సగర్వంగా ప్రకటించుకునే దానికి అర్హత సాధించుకున్నారు.

సాధారణంగా ఒక మఱ్ఱిచెట్టు నీడన మరొక చెట్టు బతకలేదంటారు. ఒక కొత్త సాంస్కృతిక సంస్థ సరికొత్తగా మోసులు ఎత్తుతున్న దశలో ద యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ దృఢంగా బాసటగా నిలబడటమే కాక, కాకినాడలోని పలు సంస్థల అధిపతులు వ్యక్తులు నగరంలోని వివిధ హోదాల్లో ఉంటూ సాంస్కృతిక చైతన్య పరిరక్షకులైన కొందరు పెద్దలు, దంటు భాస్కరరావు డాక్టర్ కెవిఎస్ సీతారాం, డాక్టర్ పివి రావు, రాష్ట్ర ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు డాక్టర్ చెలికాని స్టాలిన్ వీరు కాక, కొన్ని వ్యక్తిగత బహుమతులను తన తండ్రి కొర్రపాటి గంగాధర రావు పేరిట సౌజన్యరావు గారు అందజేశారు. ముంజలూరి విశ్వేశ్వరరావు మార్ని జానకిరామ్ చౌదరి, నాగిరెడ్డి సతీష్ రావులు, ఈ నాలుగు రోజుల నాటికల పండుగలో సమాజాల వారికి భోజన వసతి రవాణా ప్రదర్శన పారితోషికాలు, కార్యక్రమాలు సజావుగా నిర్వహించడానికి కావల్సిన సేవా సహాయ సహకారాలను అందజేసి జయప్రదం చేశారు.

కాకినాడ కల్చరల్ అసోసియేషన్ తన ఆశయంగా 'ఆలోచనలతో శాస్త్రాలు పుడితే అనుభూతితో కళలు పుట్టాయి. మేధో వికాసం హృదయ స్పందన రెండూ ఉన్నప్పుడే జీవితం సమగ్రమౌతుంది. ఎంతో ఘన చరిత్ర కలిగిన కోకనాడ నగరంలో సువిశాల మానవీయ లక్ష్యం కోసం సకల జనాల సౌభాగ్యం కోసం సమాజ శ్రేయస్సును సకల కళాసమాహారమైన రంగస్థలం ద్వారా మనోవికాస అభివృద్ధికి కృషి చేసే సంకల్పంతో తమ కల్చరల్ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు పరిషత్ కన్వీనర్ కె.కృష్ణారావు, ఆల్ కమిటీస్ ఇంచార్జ్ నాదెండ్ల ప్రభుదాసు ప్రకటించారు. మొత్తం కార్యభారాన్ని తమ భుజాల మీద మోస్తూ విజయవంతం చేశారు.

ఈ నాలుగు రోజులూ సభా ప్రాంగణాలకు నలుగురు ప్రముఖుల నాటక కళా సాహిత్య రంగాలకు విశేషమైన సేవలందించి కీర్తిశేషులైన దంటు భాస్కరరావు, బొడ్డు రాజబాబు, ఎం ప్రసాదమూర్తి, టీజే రామనాథం కళా ప్రాంగణాలని పేర్కొనడం, ప్రతిరోజు ఒక నాటకరంగ ప్రముఖుని సత్కరించడం మరొక విశేషాంశం. అందులో నాయుడు గోపి దాక్షారామం సరోజ ఎన్. రవీంద్ర రెడ్డి వైఎస్ కృష్ణేశ్వరరావులను ఆత్మీయంగా సత్కరించారు. చివరి రోజున ప్రత్యేక ప్రదర్శనగా రసఝరి పొన్నూరు వారి కాపలా నాటికను ప్రదర్శించి నాటకోత్సవాల ముగింపును మరింత అర్థవంతం చేసి అందగించారు. రచన వైయస్ భాస్కరరావు, దర్శకత్వం వై.ఎస్. కృష్ణేశ్వరరావు ... అలా అన్ని ప్రదర్శనలు.. ఏరోజుకారోజు రెండేసి ప్రదర్శనలు చూసి ఆనందంగా వెళ్లిన ప్రేక్షకులు మరికొందరికి సమాచారం ఇచ్చి దంటు కళాక్షేత్రానికి తీసుకురావడంలో తమ వంతు సహకారం అందించారు.

12వ తేదీ సాయంత్రం మొదటి ప్రదర్శన కళాంజలి హైదరాబాద్ వారి 'రైతే రాజు'. రచన కంచర్ల సూర్యప్రకాష్ దర్శకత్వం కొల్లా రాధాకృష్ణ. 'పిడికెడంత సెల్ఫోన్ లేకపోయినా బతకొచ్చు కానీ రైతు పండించే, పిడికెడు అన్నం పెట్టే వాడిని బతికించుకోలేకపోతే యుగాంతం సమీపించినట్లే' అన్న సందేశం ఇచ్చింది. తన పంటను తాను కనీస ధరకు అమ్ముకోనలేక, ఆరుగాలం కష్టపడి దక్కించుకున్న పంటకు గిట్టుబాటు ధరలను పొందలేక, నానాటికి దారిద్ర్య రేఖ కనిష్ఠ దిగువ స్థాయికి జారిపోతున్న రైతుకు శత్రువులు పెరిగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. 'రైతే రాజు' అన్న నినాదం నిజంగా సార్థకమైన నాడే అందరికీ అన్నం దొరుకుతుందని, లేకుంటే ఈ లోకం ఆకలి దప్పులతో అలమటిస్తుందని హెచ్చరిస్తుంది ఈ నాటిక.

ఆనాటి రెండవ ప్రదర్శన శ్రీ అమృత లహరి థియేటర్స్ గుంటూరు వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక. మూల కథ గంటి రాజేశ్వరి. నాటకీకరణ తాళాబత్తుల వెంకటేశ్వరరావు. దర్శకత్వం అమృతల హరి. నేటి తల్లిదండ్రులు– పిల్లలపై మితిమీరిన వాత్సల్యం మమకారాలతో స్వేచ్ఛగా పెంచితే, పెళ్లయిన కొద్దిరోజులకే వారి మధ్య అవగాహన రాహిత్యంతో మనస్పర్థలు పెంచుకొని విడిపోతున్నారు. 'పెళ్లంటే సర్దుబాటు సంసారం అంటే దిద్దుబాటు' అన్న సూత్రాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. 'నాన్న నేనొచ్చేస్తా' అని కాకుండా 'అమ్మా నాన్న, మా ఇంటికి మీరు రండి' అని స్వాగతించడాన్ని దృశ్య రూపకంగా ప్రేక్షకులకు చూపించి సందేశం ఇచ్చిన నాటిక ఇది.

రెండో రోజు మొదటి ప్రదర్శన చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'చీకటి పువ్వు' నాటిక. మూలకథ పిఎస్ నారాయణ. నాటకీకరణ పరమాత్ముని శివరాం. దర్శకత్వం మంచాల రమేష్. చేసిన తప్పును తెలుసుకొని పశ్చాత్తాపం పొందిన తర్వాత కూడా మనిషిని దూరం పెట్టడం, ప్రాణం పోయిన తర్వాత బాధపడే కంటే ఉన్నప్పుడే

అతీతంలోని సన్నివేశం

బాధ్యతగా వ్యవహరించడం, క్షమించడంలోనే నిజమైన ప్రేమ వ్యక్తం అవుతుందని తెలియచెప్పిన నాటిక, 'చీకటి పువ్వు'. మొదటి నుంచి చివరి వరకు ఉత్కంఠను కలిగిస్తూ చీకటి పువ్వుగా ప్రధాన పాత్ర అయిన పవిత్ర (గుడివాడ లహరి) ప్రదర్శించిన హావభావాలతో మమేకమవుతూ కంటతడి పెడుతూ, ప్రతికూల భావాలను ప్రక్షాళన చేస్తూ ప్రేక్షకుల మనసులను తేటపరిచే రంగస్థలం ప్రదర్శన ఇది. దర్శకుడు స్వయంగా హరి పాత్రలో అమానవీయంగా (విలనిజం) వ్యవహరిస్తూ మాటలతో పవిత్రను కుంగిపోయేలా సరికొత్తగా పాత్రను పోషించడం రెండో ప్రత్యేకత. మరింత వన్నె చేకూర్చిన సన్నివేశ గతమైన సంభాషణలు సమకూర్చి పరమాత్ముని శివరాం సమయజ్ఞత పరిణతి కనబరిచారు. ఆనాటి రెండవ ప్రదర్శన 'అందిన ఆకాశం' రచన సాయి పద్మశేఖర్ (అనంత హృదయరాజ్ కలం పేరు) దర్శకత్వం ఎస్ఎం బాషా. ఆకాశం వర్షిస్తుంది భూమిపైన, విత్తనాలు మొలకెత్తుతాయి. కానీ, ఆకాశం అందదు, అదే నాన్న అయితే భూమి అక్కున చేర్చుకుంటుంది అదే అమ్మ. ఒక చిన్నారి ఆకాశాన్ని అందుకోవడమే అందిన ఆకాశం నాటిక. రెండే ప్రధాన పాత్రలుగా మూడు రకాల జీవితాన్ని రంగాలంకరణను ప్రతీకగా చేసి సంభాషణల ద్వారా ఆ పాత్రల సాత్వికాభినయాన్ని అర్థం అయ్యేలా చేస్తుంది. నవ యవ్వనంలో ఒక యువతి తొందరపాటు వల్ల పుట్టిన బిడ్డకు తండ్రి ఎవరు? అని సమాజం ప్రశ్నిస్తుంటే ఆ తల్లి, ఆ తనయుడు పడే వేదనకు అద్దం పట్టిందీ నాటిక. మూడవరోజు మొదటి నాటిక అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'అతీతం' మూలకథ రామా చంద్రమౌళి. నాటకీకరణ శిష్లా చంద్రశేఖర్. దర్శకత్వం ఎన్ రవీంద్ర రెడ్డి. దేవుడు మనిషిని సృష్టించాడు మనిషి బానిసలను సృష్టించాడు. తిరిగి మనిషే పెంచి పోషించిన ప్రపంచీకరణ, మనిషిని యాంత్రికంగా చేసి, సంపద సృష్టిలో అవిశ్రాంతంగా పరుగులు తీయిస్తూ దేశ బంధాన్ని, పేగు బంధాన్ని మరిచి కృత్రిమంగా జీవిస్తున్న పరిస్థితిని దృశ్యమానం చేసింది అతీతం నాటిక.

నిశ్శబ్దమా, నీ ఖరీదు ఎంత?లోని దృశ్య రూపకం

వయసు పైబడిన తరుణంలో కొందరు తీవ్ర మతిమరుపు వ్యాధికి గురవుతుంటారు. తామెవమో ఎక్కడున్నామో ఏం చేస్తున్నారిమో తెలియని పరిస్థితిలో ఉంటారు. అలాంటి ఒక శారీరక అవస్థను, కన్నబిడ్డలు దూర దేశాల్లో ఉంటూ కనీసం మాట్లాడడానికి తీరుబడి దొరకదు. భార్యా పిల్లలతో కళకళలాడిన ఇల్లు నిర్జీవంగా శ్మశానతుల్యంగా కనబడుతుంటే.. అదిగో అప్పుడు ఈ మానసిక వ్యాధి మరింత ముదిరిపోతుంది. జీవన సహచరికి దుర్భర వేదనను కలిగిస్తుంది. యంత్రంలా, రాయిగా మారిపోతున్న మనిషిని మళ్లీ మనిషిగా చేసేదే అతని సంతానం. అలా ఒకరు అతీతం, మరొక తరానికి కనువిప్పు గుణపాఠం చెప్పేదే ఈ నాటిక.

మూడవరోజు రెండో ప్రదర్శన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం బోరివంక శ్రీకాకుళం జిల్లా వారి కొత్త పరిమళం నాటిక. మూలకథ కాండ్రేగుల శ్రీనివాసరావు నాటకీకరణ కేకేయల్ స్వామి దర్శకత్వం.. బిఎంఎస్ పట్నాయక్. జాతి మత ద్వేషాలతో ఇరుగుపొరుగు దేశాలు రగిలిపోతుండగా మానవత్వం మంట కలిస్తే వాటి మధ్య నలిగిపోయిన సరిహద్దు జీవిత గాథే ఇది. సహనాన్ని, క్రౌర్యాన్ని ఎదురు బొదురుగా నిలబెడితే, ద్వేషంతో రగిలే మనసు సైతం వెన్నెలంత చల్లదనాన్ని నెమ్మదితనాన్ని ప్రదర్శించగలిగితే ఆ ఇద్దరి మధ్యే కాదు, ఆ సరిహద్దు గ్రామ ప్రజల్లో మంచుకొండలను కూడా మంచితనపు కొండలుగా మనసుల్లో మార్పు తేగలదనే సందేశంతో కూడిన నాటిక ఇది.

ఈ నాటికల పోటీ ప్రదర్శనలో చివరిరోజు అంటే నాలుగవ రోజు ఏడవ ప్రదర్శన 'నిశ్శబ్దమా, నీ ఖరీదు ఎంత?' తెలుగు లలిత కళా సమితి విశాఖపట్నం వారిది. కథ నాటకీకరణ పి.టి. మాధవ్. దర్శకత్వం చలసాని కృష్ణ ప్రసాద్. వివాహం, దాంపత్యం కుటుంబ జీవనం వీటికి అర్థం ఏమని చెప్పుకుందాం? అక్రమ సంబంధం– నిత్యం కళ్ళెదుట కనబడుతుంటే ఆ పరిస్థితుల్లో నలిగిపోయే పిల్లల పరిస్థితి ఏమిటి? వారి భద్రత మాట ఏమిటి? వారి పెంపకం పోషణ మాటేమిటి ? వివాహేతర సంబంధాలు ఎంత దాకా పయనించి చివరికి ఎలా పరిణమిస్తాయి? ఆర్థికంగా బలంగా కనిపించినా నైతికంగా బలహీనపడితే ఆ ప్రగతి సౌధం ఎంత కాలం నిలబడగలుగుతుంది? అన్న ప్రశ్నను బలంగా వేసే ప్రేక్షక హృదయాల్లో వేడి పుట్టించిన నాటిక ఇది.

ఈ నాటికల పోటీ పరిషత్తులో నిశ్శబ్దమా నీ ఖరీదెంత?, చీకటి పువ్వు, అతీతం నాటికలకు మొదటి రెండు మూడు స్థానాలు ప్రకటించారు. గుణ నిర్ణేతలుగా డాక్టర్ కేజీ వేణు, మల్లేశ్వర రావు ఆకుల, డి రమా సత్యనారాయణ వ్యవహరించారు..

ఈ ఏడు నాటికల ప్రదర్శనలను ఒకసారి సమీక్షించుకుంటే జీవితంలో ఏ చిన్న వాస్తవానికో పెద్ద మోతాదులో కల్పన చేసి తయారుచేసిన నాటకానికీ ఈ కఠోరమైన జీవన వాస్తవాలను అత్యంత ప్రతిభావంతంగా 60 నిమిషాల ప్రత్యక్ష ప్రసారం లాంటి, తడబాట్లకు దిద్దుబాటులకు అవకాశం లేని రియల్ లైఫ్ సైజ్ డ్రామాని, ఎంతో అర్థవంతమైన ముగింపుతో, ప్రేక్షకులను ఆలోచనలకు గురిచేసి ఆధునిక తెలుగు నాటకంపై భరోసా పెంచిన సందర్భం ఇది. ఒక ప్రదర్శన అత్యుత్తమంగా రూపుదిద్దుకోవాలంటే దాని రచన దర్శకత్వం చతుర్విధ అభినయాల సమతూకపు పోషణ, రంగస్థల నేపథ్యంలో బలం చేకూర్చే సాంకేతిక అంశాలు, వేటి స్థానంలో అవి చక్కగా ఒదిగిపోవాలి. పరిషత్ నాటికలు అంటే మూస నాటకాలని చప్పట్లు కొట్టించే మాస్ మసాలా ఉండే డైలాగులు, సెంటిమెంట్లతో కూడిన వ్యవహారం కాదని, ముగ్గురు గుణ నిర్ణేతలు వాళ్ళ ఇష్టానుసారం, నాటిక స్థానాన్ని నిర్ణయించే లోపాయికారి వ్యవహారం కాదని తేల్చి చెప్పింది. అలాగే ప్రభుత్వ సహాయం లేకున్నా, ప్రజలే పోషకులుగా నడిపించే పరిషత్తు నాటకమే తెలుగు నాటకాన్ని బతికిస్తోందని, బతికించుకునేందుకు శ్రమించే నిబద్ధత కలిగిన సమాజాలు ఉన్నాయని భరోసా కల్పించిన కాకినాడ నాటక పరిషత్.

– మల్లేశ్వర రావు ఆకుల
7981872655

బైక్ మెకానిక్ గా రాహుల్

- ఢిల్లీలోని కరోల్‌బాగ్‌లో టూవీలర్‌కు మరమ్మతులు

న్యూఢిల్లీ : భారత్ జోడో యాత్ర తర్వాత కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లారీలలో ప్రయాణిస్తూ ..డ్రైవర్ల కష్టాలు విన్నారు. తాజాగా ఢిల్లీలోని కరోల్‌బాగ్‌లోని బైక్ మెకానిక్ షాపులను సందర్శించారు. అక్కడి కార్మికులతో ముచ్చటించిన రాహుల్.. వారితో కలిసి కొన్ని బైక్‌లను రిపేర్ చేసేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా తన వద్ద ఉన్న బైక్ గురించీ ప్రస్తావించిన రాహుల్.. దాన్ని ఎందుకు బయటకు తీయరో వివరించారు. ఇందుకు సంబంధించిన వీడియో రాహుల్ గాంధీ తన యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేశారు.

'నా దగ్గర కేటీఎం 390 బైక్ ఉంది. కానీ, దాన్ని నేను వినియోగించను. దాన్ని నడిపేందుకు నా భద్రతా సిబ్బంది అనుమతించరు. మీ సమస్యలను తెలుసుకునేందుకు నేను ఇక్కడకు వచ్చాను' అని మెకానిక్‌లతో రాహుల్ గాంధీ చెప్పారు. మీ పెళ్లి ఎప్పుడు జరుగుతుంది..? అని మెకానిక్‌లు అడిగిన ప్రశ్నలకు మాత్రం రాహుల్ నుంచి చిరునవ్వే సమాధానమైంది.

ఢిల్లీ ఐఐటిలో విద్యార్థి ఆత్మహత్య

ఢిల్లీ : దేశవ్యాప్తంగా ఐఐటీ ల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యల ఘటనలు కలకలం రేకెత్తిస్తున్నాయి. తాజాగా ఐఐటీ ఢిల్లీఓ లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీకి చెందిన ఆయుష్ అనే విద్యార్థి ఐఐటీ ఢిల్లీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి ఆ విద్యార్థి క్యాంపస్‌లోని ఉదయగిరి హాస్టల్‌లోని తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఏడాదిలో దేశంలోని ఐఐటీల్లో ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఐఐటీ మద్రాస్‌లో నలుగురు , ఐఐటీ బాంబేలో ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మార్చి నెలలో ఐఐటీ మద్రాస్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన పీహెచ్‌డీ విద్యార్థి, ఏప్రిల్ నెలలో ఇద్దరు బీటెక్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ఎస్‌ఎయు అధ్యాపకుల సస్పెన్షన్ రద్దు చేయండి

- విదేశాంగ మంత్రులకు విద్యావేత్తల వినతి

న్యూఢిల్లీ : సౌత్ ఆసియన్ యూనివర్సిటీ (ఎస్‌ఎయు)కి చెందిన నలుగురు అధ్యాపకులపై విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఐదు వందల మందికి పైగా విద్యావేత్తలు దక్షిణాసియా దేశాల విదేశాంగ మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంత్రులకు లేఖలు రాశారు. వీరిలో ఇర్ఫాన్ హబీబ్, ప్రభాత్ పట్నాయక్, అకీల్ బిల్‌గ్రామీ, జ్ఞాన్ ప్రకాశ్, అడ్రే ట్రస్కే వంటి ప్రముఖులు ఉన్నారు. ఫెలోషిప్ స్టైఫండ్ పెంపుదలపై విద్యార్థులకు, అధికారులకు మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించాల్సిందిగా కోరినందుకు అధ్యాపకులపై సస్పెన్షన్ వేటు వేశారు. సమ్మె చేస్తున్న విద్యార్థులను చెదరగొట్టేందుకు ఢిల్లీ పోలీసులను యూనివర్సిటీ క్యాంపస్‌లోకి అనుమతించడాన్ని కూడా ఉపాధ్యాయులు తప్పుపట్టారు. ప్రవర్తన సరిగా లేని కారణంగా వారిని సస్పెండ్ చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ దానిపై సస్పెన్షన్ ఆదేశాలలో ఎలాంటి వివరణ ఇవ్వలేదు. తమకు ఇస్తున్న నెలవారీ స్టైఫండ్‌ను గత సంవత్సరం తగ్గించడాన్ని విద్యార్థులు వ్యతిరేకించారు. పలు కమిటీలలో తమకు సహేతుకమైన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న విద్యార్థుల పట్ల అధికారులు ప్రవర్తించిన తీరును ప్రశ్నిస్తూ అధ్యాపకులు ఈ-మెయిల్స్‌లో సమాచారాన్ని పంపారు. దీనిపై ఆగ్రహించిన అధికారులు వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పాక్‌లో భారీ వరదలు

- 76 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌ను మరోసారి భారీ వరదలు ముంచెత్తున్నాయి. గతేడాది వరదల నుంచే ఇప్పటికీ కోలుకోలేక విలవిలాడుతున్న పాక్‌లో మళ్లీ భారీ వర్షాలు కారణంగా వరదలు విజృంభిస్తున్నాయి. దీంతో కొన్ని రోజుల నుంచి ఆదివారం వరకు 76 మంది ప్రాణాలు కోల్పోగా.. 133 మందికి గాయాలైనట్లు అక్కడి జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. నెలరోజులుగా కురుస్తోన్న వర్షాలకు అనేక ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతోంది. కేవలం పంజాబ్ ప్రావిన్సులోనే ఇప్పటివరకు 48 మంది ప్రాణాలు కోల్పోయారు. ఖైబర్ పంఖ్తుఖ్వా ప్రావిన్సులో 20 మందితోపాటు బలోచిస్థాన్‌లో ఐదుగురు చనిపోయినట్లు సంస్థ వెల్లడించింది. శనివారం ఒక్కరోజే 18 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది.

అప్పుల ఊబిలో దేశం

- పోటీపడి రుణాలు తీసుకుంటున్న కేంద్రం, రాష్ట్రాలు
- అంతిమంగా ప్రజల పైనే భారం
- వ్యక్తిగత రుణాలూ పెరిగాయి

న్యూఢిల్లీ : 2014వ సంవత్సరం నుండి దేశం క్రమేపీ అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. గడచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు 200% పెరగగా, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం సుమారు 150% పెరిగింది. ఇవి సాక్షాత్తూ రిజర్వ్‌బ్యాంక్ వెల్లడించిన అప్పుల చిట్టాలు. కేంద్ర ప్రభుత్వ రుణభారం 2022-23 సంవత్సరాంతానికి రూ.157 లక్షల కోట్లకు చేరగా, రాష్ట్రాలు రూ.76 లక్షల కోట్ల మేర అప్పుల్లో ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి వివిధ బ్యాంకుల నుండి ప్రజలు తీసుకున్న వ్యక్తిగత రుణాలు కూడా రూ.41 లక్షల కోట్లకు చేరాయి. 2014తో పోలిస్తే ఈ అప్పులు 400% పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ రూ.45 లక్షల కోట్లు కాగా ప్రజల వ్యక్తిగత రుణాలు దాదాపుగా అదే స్థాయిలో ఉండడం విశేషం.

మరోవైపు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు బ్యాంకు రుణాలను పెద్దగా తీసుకోవడం లేదు. దీనిని బట్టి అవి తమ సామర్థ్యాలను పెంచుకోవడం లేదని అర్థమవుతోంది. అంటే ఏమిటి? ఆ పరిశ్రమలు ఉద్యోగాలను కల్పించలేకపోతున్నాయి. దీంతో కుటుంబ ఆదాయాలు పరిమితంగానే ఉంటున్నాయి. స్థూల దేశీయోత్పత్తిలో ప్రయివేటు వినియోగ వ్యయం తగ్గిపోతోందని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. అంటే కుటుంబాలను నెట్టుకురావడం కష్టమవుతోందన్న మాట.

మనకు మేలు చేయదు

వ్యక్తిగత రుణాలు పెరగడం శుభ పరిణామమని కొందరు వాదిస్తున్నారు. వస్తువులు, సేవల కొనుగోలు కోసం ప్రజలు రుణాలు తీసుకుంటారని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు మంచిదని వారి వాదన. అయితే మంచి ఆదాయాలు, మేలైన సామాజిక భద్రత, నిలకడైన ఉద్యోగాలు కలిగి ఆర్థికంగా పురోభివృద్ధి చెందుతున్న వ్యవస్థలకు ఇది మేలు చేయవచ్చు. కానీ భారత ఆర్థిక వ్యవస్థ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుంటే ఇదేమీ మంచి సంకేతాన్ని ఇవ్వదు. పైగా పరిస్థితి మరింత క్షీణిస్తుంది. ఎందుకంటే మన దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నాయి. ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు కూడా తక్కువగానే లభిస్తున్నాయి. పారిశ్రామిక రంగం తక్కువ వృద్ధిరేటును నమోదు చేస్తోంది. వచ్చే జీతం సరిపోక ప్రజలు రుణాలు తీసుకోవాల్సి వస్తోంది తప్ప ఖరీదైన విలాస వస్తువుల కొనుగోలు కోసం కాదు.

వడ్డీలకే సరి

ప్రభుత్వాలు తమ కార్యకలాపాల కోసం తరచుగా రుణాలు తీసుకుంటాయి. బ్యాంకులు వంటి ప్రైవేటు వాణిజ్య వనరుల ద్వారా లేదా ప్రజలకు జారీ చేసిన బాండ్ల ద్వారా లేదా ప్రావిడెంట్ ఫండ్ కార్పస్ నుండి లేదా చిన్న మొత్తాల పొదుపు నిధి నుండి ప్రభుత్వాలు రుణాన్ని సేకరిస్తాయి. అయితే ఈ రుణాల మొత్తం కొండలా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2022-23లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణాలలో 58% మార్కెట్ వనరుల నుండి పొందినవే. అంటే బ్యాంకుల వంటి వాణిజ్య సంస్థల నుండి తీసుకున్నవి. ఈ తరహా రుణాలపై వడ్డీ భారం అధికంగా ఉంటుంది. 2023-24 బడ్జెట్ అంచనాల ప్రకారం వడ్డీ చెల్లింపులకే సుమారు రూ.11 లక్షల కోట్లు వినియోగించాల్సి వస్తుంది. సంవత్సరంలో చేసే మొత్తం వ్యయంలో ఇది 23%. అంటే ప్రజల సొమ్ములో అధిక భాగం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణాలపై వడ్డీ చెల్లింపులకే వినియోగిస్తున్నారు. రుణాలను చెల్లించడం సంవత్సరాల తరబడి కొనసాగుతూనే ఉంటోంది. తదుపరి ఏర్పడే ప్రభుత్వాలకు ఇది పెద్ద తలనెప్పిగా మారుతుంది.

ఈ రుణాలన్నీ ఎవరికి ఖర్చవుతున్నాయంటే..?

తీసుకున్న రుణాలను ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేస్తే దానిని సమర్థించవచ్చు. కానీ ప్రభుత్వాలు సంక్షేమానికి కోత పెడుతున్నాయి. భారీ వ్యయాన్ని భరించలేమని, బడ్జెట్‌ను సమతూకం చేసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నాయి. మరి ప్రభుత్వం తీసుకుంటున్న రుణాలు ఎక్కడికి పోతున్నాయి? కార్పొరేట్ రంగంలోకి. ఈ రంగానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది.

పన్ను మినహాయింపులు, సబ్సిడీలు వంటి తాయిలాలు ఇస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న రుణాలలో ఎక్కువ భాగం ఈ రాయితీలు ఇచ్చేందుకే ఖర్చు చేస్తున్నారు. జాతీయ రహదారులు, వందేభారత్ వంటి వేగంగా నడిచే రైళ్లు వంటి భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపైనా రుణాలలోనూ ను వెచ్చిస్తున్నారు. నిధుల వినియోగం నిత్యం ప్రశార్థకమవుతోంది.

రాష్ట్రాలు సైతం...

రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తామేమీ తక్కువ తినలేదన్నట్లు భారీగానే రుణాలు తీసుకుంటున్నాయి. 2014-15లో అన్ని రాష్ట్రాల రుణభారం రూ.25 లక్షల కోట్లు ఉంటే అది ప్రస్తుత సంవత్సరంలో రూ.76 లక్షల కోట్లకు చేరిందని అంచనా. 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టిన తర్వాత పన్నులు, సుంకాల విషయంలో రాష్ట్రాలకు అధికారాలు లేకుండా పోయాయి. దీంతో వాటి ఆదాయం తగ్గిపోయింది. పైగా పెట్టుబడుల కోసం మూలధనాన్ని పెంచేందుకు కేంద్రం కఠినమైన, ఆర్థికంగా భారమైన షరతులు విధిస్తోంది. వివిధ పథకాలకు నిధుల కేటాయింపుపై కూడా కేంద్రం పెత్తనం చెలాయిస్తోంది. ఇది రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద సమస్యగా మారింది.

అనేక రాష్ట్ర ప్రభుత్వాలు రుణాల సేకరణ విషయంలో కేంద్రాన్నే అనుసరిస్తున్నాయి. రాజకీయంగా ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టులు చేపట్టి భారీగా ఖర్చు చేస్తున్నాయి. కేంద్రం మాదిరిగానే స్థానిక కార్పొరేట్ శక్తులు, వ్యాపారులకు రాయితీలు ఇస్తున్నాయి. వీటన్నింటి ఫలితంగా దేశ ప్రజల నెత్తిపై మోయలేని రుణభారం పడుతోంది. ఎందుకంటే అంతిమంగా ఈ అప్పులు తీర్చాల్సింది ప్రజలే.

బంగాళా దుంపల పేటెంట్‌పై పెప్సికో పిటిషన్‌ను తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : పెప్సికో కంపెనీ తయారుచేసే లే పొటాటో చిప్స్ కోసం ప్రత్యేకంగా బంగాళాదుంపల వెరైటీ మొక్కలను పెంచేందుకు గల పేటెంట్‌ను రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై కంపెనీ పెట్టుకున్న పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. పెప్సికో కోసం ప్రత్యేకంగా పెంచే ఎఫ్‌సి5 వెరైటీకి మంజూరు చేసిన మేథో సంపత్తి పరిరక్షణ హక్కులను 2021లో పిపివిఎఫ్‌ఆర్ (మొక్కల వెరైటీలు, రైతుల హక్కుల పరిరక్షణ) సంస్థ రద్దు చేసింది. విత్తన రకాలపై పేటెంట్‌ను భారతీయ నిబంధనలు అనుమతించడం లేదని పేర్కొంది. విత్తన రకంపై కంపెనీ పేటెంట్‌ను క్లెయిమ్ చేయలేదంటూ రైతు హక్కుల కార్యకర్త కవితా కురుగంటి వాదించడంతో ఆ సంస్థ పెప్సికో పేటెంట్‌ను తొలగించింది. దీనిపై పెప్సికో కంపెనీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ఆ అప్పీల్‌ను కొట్టివేస్తూ ఈ నెల 5న న్యాయమూర్తి నవీన్‌చావ్లా ఆదేశాలు జారీ చేశారు.

బెంగాల్‌లో 700 స్థానాల్లో రీపోలింగ్

- ఎస్‌ఇసి ఆదేశం

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో హింసాకాండ, భయోత్పాత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 700 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఇసి) ఆదితవారం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర బలగాల పర్యవేక్షణలో సోమవారం నాడు రీపోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ సిన్హా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 61,636 కేంద్రాల్లో శనివారం పోలింగ్ జరిగిన సంగతి విదితమే. అత్యధిక హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న ముర్షిదాబాద్ జిల్లాలో 175 పోలింగ్ కేంద్రాల్లోనూ, మల్దాలో 112 కేంద్రాల్లోనూ రీపోలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నదియా జిల్లాలో 89 చోట్ల, ఉత్తర 24 పరగణాలు జిల్లాలో 46 స్థానాల్లోనూ, దక్షిణ 24 పరగణాలు జిల్లాలో 36 పోలింగ్ కేంద్రాల్లోనూ, అలాగే తూర్పు మిడ్నాపుర్‌లో 31 చోట్ల, హూగ్లీలో 29 కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించనున్నట్లు రాజీవ్ తెలిపారు. కాగా ఉత్తర దినాజ్‌పుర్ జిల్లాలో 42 కేంద్రాల్లోనూ, కూచ్ బీహార్‌లో 54 చోట్ల, బిర్భుమ్‌లో 14 కేంద్రాల్లో రీపోలింగ్‌కు ఆదేశించారు. అయితే దక్షిణ 24 పరగణాలు జిల్లాలో పెద్ద ఎత్తున హింస చోటుచేసుకున్న భన్గార్ ప్రాంతంలో ఏ కేంద్రంలోనూ రీపోలింగ్‌కు ఆదేశించకపోవడం గమనార్హం.

అమిత్ షాకు నేడు గవర్నరు నివేదిక

కాగా పంచాయితీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున హింస చోటుచేసుకున్న నేపథ్యంలో రాష్ట్ర గవర్నరు సివి ఆనంద బోస్ ఆదివారం న్యూఢిల్లీకి వెళ్లారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సోమవారం సమావేశమై హింసాత్మక ఘటనలపై ఆయన నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

లూలా హయాంలో తగ్గిన అమెజాన్ అడవుల నరికివేత

వెల్లడించిన ఉపగ్రహ డేటా

బ్రసీలియా : బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా డసిల్వా బాధ్యతలు చేపట్టిన ఆరు మాసాల్లో అమెజాన్ అడవుల నరికివేత 33శాతం తగ్గిందని ప్రభుత్వ ఉపగ్రహ డేటా తెలిపింది. గత నాలుగేళ్ళుగా బ్రెజిల్‌లోని అమెజాన్ ప్రాంతంలో అడవుల నరికివేత బాగా పెరిగింది. అయితే లూలా అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందని అధికారులు తెలిపారు. గురువారం ఈ డేటాను విడుదల చేశారు. జనవరి నుండి జూన్ వరకు ఆరు మాసాల కాలంలో అడవుల క్షీణత 2500 చదరపు కిలోమీటర్ల నుండి 1023 చదరపు మైళ్లకు తగ్గిందని వార్తలు వెలువడ్డాయి. మాజీ అధ్యక్షుడు జేర్ బోల్సనారో హయాంలో అయితే ఈ ఈ విస్తీర్ణం 2500 చదరపు మైళ్ళుగా వుంది. ప్రస్తుతానికి పరిస్థితులను మార్చగలిగామని, అడవుల నరికివేతను బాగా తగ్గించగలిగామని పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యనిర్వాహక కార్యదర్శి జోవో పాలో చెప్పారు. ఇది వాస్తవం, అడవుల నరికివేత తగ్గుతోందని చెప్పారు. అయితే రాబోయే మాసాల్లో ఇంకా పలు సవాళ్లు ఎదుర్కొనాల్సి వున్నాయని, అవి కూడా పూర్తయితే పూర్తి స్థాయి ఫలితాలు వెల్లడవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఈ డేటా ప్రోత్సాహకరంగా వుందన్నారు. గత 15ఏళ్లలో ఎన్నడూ లేనిస్థాయిలో ప్రస్తుతం మెరుగైన పరిస్థితి నెలకొందన్నారు.

పన్నుల పెంపునకు వ్యతిరేకంగా కెన్యాలో నిరసనల హోరు

- పోలీసుల దమనకాండలో ముగ్గురు మృతి

నైరోబి : పన్నుల పెంపును నిరసిస్తూ కెన్యా ప్రజలు వీధుల్లోకి వచ్చి పెద్దయెత్తున నిరసన తెలిపారు రాజధాని నైరోబిలో పోలీసులు లాఠీలు, బాష్పవాయు గోళాలతో విరుచుకుపడ్డారు. పోలీసుల దమనకాండకు కిసుములో ఇద్దరు మరణించగా, మిగోరిలో మరొకరు మరణించారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి విలీ ముతుంగాతో సహా పలువురు ప్రముఖులు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. పన్ను పెంపును నిరసిస్తూ ఆందోళనలు చేస్తున్న వారిని అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పోలీసుల దాష్టీకంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కెన్యాజాతీయ మానవ హక్కుల కమిషన్ కోరింది.

లండన్‌లో ఖలిస్తాన్ అనుకూల నిరసనలు

లండన్ : లండన్‌లో భారత హై కమిషన్ కార్యాలయం వెలుపల చోటు చేసుకున్న ఖలిస్తాన్ అనుకూల నిరసనలు ఎలాంటి గొడవలు లేకుండా శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మూడు నుండి మూడున్నర గంటల పాటు ప్రదర్శన వుంటుందని తొలుత భావించినా అంతకంటే తక్కువ సమయంలోనే శనివారం నాటి ప్రదర్శన ముగిసింది. వర్షం పడుతున్న ఆ సమయంలో చాలాకొద్దిమంది మాత్రమే ప్రదర్శనలో పాల్గొన్నారని మీడియావార్తలు పేర్కొన్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఇదే ప్రాంతంలో జరిగిన ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. జూన్ 18న బ్రిటీష్ కొలంబియాలో ఖలిస్తానీ కార్యకర్త హర్‌దీప్ సింగ్ నిజార్ హత్య నేపథ్యంలో మెల్‌బోర్న్, శాన్‌ఫ్రాన్సిస్కో, టొరంటో సహా ప్రపంచవ్యాప్తంగా పలు నగరాల్లో నిర్వహిస్తున్న ప్రదర్శనల్లో భాగంగా ఈ నిరసనలు చోటు చేసుకున్నాయి. కాగా భారత్‌లో నిజార్‌పై తీవ్రవాద అభియోగాలు నమోదయ్యాయి. నిజార్ హత్యకు కారణమంటూ బ్రిటన్‌లో భారత హై కమిషనర్, కాన్సుల్ జనరల్ ఫోటోలను ఆ ప్రదర్శన సందర్భంగా ఆందోళనకారులు ప్రదర్శించారు.

21 నుండి భారత్‌లో శ్రీలంక అధ్యక్షుడి పర్యటన

కొలంబో : శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె ఈ నెల్లో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ నెల 21 నుండి రెండు రోజుల పాటు ఈ పర్యటన జరగనుంది. ఈ పర్యటనా కాలంలో ఆయన భారత ప్రధాని నరేంద్ర మోడీని కలుసుకునే అవకాశం వుందని ఆదివారం అధికారులు తెలిపారు. గతేడాది జులైలో దేశంలో తిరుగుబాటు నేపథ్యంలో రాజపక్సా ప్రభుత్వం వైదొలగిన తర్వాత అధ్యక్షుడుగా విక్రమసింఘె నియమితులయ్యారు. ఆ తర్వాత ఆయన భారత్‌లో జరుపుతున్న తొలి పర్యటన ఇదే. ఈ పర్యటనా వివరాలను రూపొందించేందుకు వచ్చే వారం భారత విదేశాంగ కార్యదర్శి వినయ్ మోహన్ క్వత్రా శ్రీలంక రానున్నారని డైలీ మిర్రర్ వార్తాపత్రిక తెలిపింది. విద్యుత్, ఇంధనం, వ్యవసాయ రంగాలతో సహా సముద్ర జలాలకు సంబంధించిన పలు భారత ప్రాజెక్టుల అమలును విక్రమసింఘె ఖరారు చేసే అవకాశం వుందని అధికారులు తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు కఠినంగా వున్నప్పటికీ ఆర్థిక సంస్కరణలను విక్రమసింఘె ప్రవేశపెట్టారు. దీంతో ఆర్థికవ్యవస్థలో కొంత మెరుగుదల కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే అధ్యక్షుడి పర్యటన జరగనుంది. కీలకమైన విధాన చర్యల అమల్లో భాగంగా ఈ చర్యలు తీసుకున్నారు. అయితే ఆర్థిక పునరుద్ధరణ అనేది విక్రమ సింఘె ప్రభుత్వానికి పెద్ద సవాలుగానే వుంది.

అంతర్యుద్ధం దిశగా సూడాన్!

- యుఎన్ చీఫ్ హెచ్చరిక

న్యూయార్క్ : సూడాన్‌లో సంక్షోభం పూర్తి స్థాయి అంతర్యుద్ధంగా మారే ప్రమాదముందని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటానియో గుటెరస్ హెచ్చరించారు. దాదాపు మూడు మాసాలుగా సూడాన్‌లో ఘర్షణలు కొనసాగుతునే వున్నాయి. రాజధాని ఖార్టూమ్‌లో ఆదివారం కూడా ప్రత్యర్థి సైనిక జనరల్స్ మధ్య ఘర్షణలు భీకరంగా కొనసాగాయి. సూడాన్ మిలటరీ, శక్తివంతమైన పారా మిలటరీ బలగాల మధ్య జరుగుతున్న పోరాటంతో దేశం మొత్తంగా అస్థిరమయ్యే ప్రమాదం వుందని శనివారం సాయంత్రం ఆయన హెచ్చరించారని గుటెరస్ డిప్యూటీ ప్రతినిధి ఫర్హాన్ హక్ తెలిపారు. ఏప్రిల్ మధ్యలో ఇరు వర్గాల మధ్య ప్రారంభమైన ఈ ఘర్షణలు అనతికాలంలోనే బహిరంగ పోరాటంగా మారిపోయాయి. ఇప్పటివరకు ఈ ఘర్షణల్లో 3వేల మందికి పైగా మరణించారని, 6వేల మందికి పైగా గాయపడ్డారని ఆరోగ్య మంత్రి హైతమ్ ఇబ్రహీమ్ తెలిపారు. కానీ అనధికారికంగా మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే వుండే అవకాశం వుంది. సూడాన్‌లోనే 29లక్షల మందికి పైగా ప్రజలు తమ ప్రాంతాలను వీడి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోయారు. వీరిలో కొంతమంది పొరుగు దేశాలకు కూడా తరలిపోయారు. 2021 అక్టోబరులో సైనిక కుట్రలో అక్కడి పౌర ప్రభుత్వం కూలిపోయింది.ఆ తర్వాత 18మాసాలకు ఈ ఘర్షణలు చోటు చేసుఉన్నాయి. దీంతో శాంతియుతంగా ప్రజాస్వామ్య క్రమానికి బదిలీ కాగలమన్న ప్రజల ఆశలు చెల్లాచెదుర్యాయి. ఈ ఘర్షణలతో రాజధాని ఖార్టూమ్, ఇతర పట్టణ ప్రాంతాలు కదనరంగాలుగా మారిపోయాయి.

రాజిబుల్ హక్యూకు ఘన నివాళి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో హింసాకాండలో శనివారం టిఎంసి గూండాల చేతిలో హతమైన సిపిఎం కార్యకర్త రాజిబుల్ హక్యూకు ఆదివారం ఘనంగా నివాళిఅర్పించారు. బిష్ణుపూర్ గ్రామానికి చెందిన హక్యూ మృతదేహన్ని ఈస్ట్ బుర్ద్వాన్ జిల్లా పార్టీ కార్యాలయంలో సందర్శనార్థం ఉంచారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం, ఇతర నాయకులు, వందలాది పార్టీ కార్యకర్తలు ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం హక్యూ స్వగ్రామానికి మృత దేహాన్ని తరలించారు. అంత్యక్రియలు నిర్వహించారు.

తీస్తా సెతల్వాద్‌పై ఆరోపణలను ఉపసంహరించుకోవాలి

- ఉద్యమకారులపై వేధింపులకు ముగింపు పలకాలి
- పెన్ ఇంటర్నేషనల్ ఆందోళన

న్యూఢిల్లీ : గ్లోబల్ ఫ్రీ స్పీచ్ వాచ్‌డాగ్ పెన్ ఇంటర్నేషనల్.. హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్‌పై న్యాయవ్యవస్థ, మోడీ సర్కారు చర్యలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఆమెను జైలులో ఉంచడానికి కొనసాగుతున్న ప్రయత్నాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అదే సమయంలో స్వేచ్ఛా వ్యక్తీకరణ, భారత ప్రభుత్వంపై శాంతియుత విమర్శల కోసం శత్రువు వాతావరణ తీరును తప్పుబట్టింది. "సెతల్వాద్‌పై ఉన్న అన్ని ఆరోపణలను తక్షణమే ఉపసంహరించుకోవాలి. వారి శాంతియుత వ్యక్తీకరణ కోసం రచయితలు, జర్నలిస్టులు, ఉద్యమకారులపై వారి వేధింపులకు ముగింపు పలకాలని సంస్థ భారత అధికారులను కోరుతున్నది" అని పెన్ ఇంటర్నేషనల్ ఒక ప్రకటనలో తెలిపింది. 2002 అల్లర్లకు సంబంధించి అప్పటి గుజరాత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముంబయికి చెందిన కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు గుజరాత్ హైకోర్టు గత వారం బెయిల్ నిరాకరించిన విషయం విదితమే. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సుప్రీంకోర్టు ఆమె మధ్యంతర బెయిల్‌ను పొడిగించడంతో ఆమెకు కాస్త ఊరట లభించింది. సుప్రీంకోర్టులో తదుపరి విచారణ ఈనెల 19న జరగనున్నది.

పెరిగిన ప్రైవేటు పెట్టుబడులు

- విదేశీ కంపెనీలకే ప్రయోజనాలు

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో దేశంలో ప్రైవేటు పెట్టుబడులు బాగా పెరిగాయి. ఈ పెట్టుబడులు ప్రధానంగా రవాణా రంగంలో...అంటే విమానయాన రంగంలో వచ్చాయని బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఆర్థిక పరిశోధనా విభాగం తెలిపింది. అయితే తొలి త్రైమాసికంలో వచ్చిన ఈ పెట్టుబడులు దేశంలో నూతన వ్యాపారాలను ప్రారంభించేందుకు ఉపయోగపడలేదు. దేశానికి చెందిన అన్ని ఆర్డర్లు విదేశాలలోని కంపెనీలకే వెళ్లాయి. ఈ పెట్టుబడులతో విదేశీ కంపెనీలు కొత్తగా విమానాల ఉత్పత్తి చేపడతాయి. మరో మాటలో చెప్పాలంటే ఈ ప్రయివేటు పెట్టుబడులు విదేశీ కంపెనీలకే ప్రయోజనం చేకూరుస్తాయి. 2022-23లో ప్రయివేటు రంగానికి చెందిన పెట్టుబడులు బాగా పెరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన మరో నివేదిక తెలిపింది.

2019, 2020 సంవత్సరాలలో ప్రయివేటు పెట్టుబడులు తగ్గాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ప్రస్తావించింది. 2021లో పరిస్థితి కొంతమేర ఆశాజనకంగా ఉందని, అది 2022లోనూ, ఈ సంవత్సరం కూడా కొనసాగిందని వివరించింది. అయితే 2016, 2017 సంవత్సరాలతో పోలిస్తే ఇప్పటికీ ప్రయివేటు పెట్టుబడుల ప్రవాహం తక్కువగానే ఉన్నదని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి త్రైమాసికంలో రూ.5.96 లక్షల కోట్ల ప్రయివేటు పెట్టుబడులు వచ్చాయి. గత సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన పెట్టుబడులు రూ.5.79 లక్షల కోట్లు. తొలి త్రైమాసికంలో ప్రకటించిన నూతన ప్రాజెక్టులలో 74% రవాణా రంగానికి సంబంధించినవే. విద్యుత్ రంగంలో 10%, రసాయనాల రంగంలో 8%, యంత్రాల రంగంలో 3%, ఆటో రంగంలో 2% మేర పెట్టుబడులు వచ్చాయి.

ప్రయివేటు కంపెనీలు రుణాలు సేకరించి పెట్టుబడులు పెడుతున్నాయి. రుణాలు లభించకపోతే పెట్టుబడులు పెట్టవు. ఈ సంవత్సరం బాండ్ మార్కెట్ నుంచి ప్రయివేటు కంపెనీలు రూ.2.33 లక్షల కోట్ల మేర రుణాలు తీసుకున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ.

మోడీది ద్వంద్వ వైఖరి

- మోసగాళ్లు దేశం విడిచి పారిపోయారు
- ప్రధానిపై కాంగ్రెస్ మాటల దాడి

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ మాటల దాడికి దిగింది. మోడీ పాలనలో దుండగులు, మోసగాళ్ల జాబితాను ఆ పార్టీ ఉటంకించింది. ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మోడీపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అవినీతికి గ్యారెంటీ అయితే.. అవినీతికి వ్యతిరేకంగా చర్యకు మోడీ గ్యారెంటీ అని తన బహిరంగ సభలలో ప్రతిపక్ష నాయకులపై మోడీ ఆరోపణల దాడి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోడీ తీరుపై కాంగ్రెస్ పై విధంగా స్పందించటం గమనార్హం. అవినీతి విషయంలో మోడీ ద్వంద్వ వైఖరి ఇప్పుడు దేశమంతా తెలుస్తున్నదన్నారు. అవినీతిపై మోడీని టార్గెట్ చేసేందుకు రాహుల్ గాంధీ అనర్హత వేటును ఖర్గే లేవనెత్తారు. "రాహుల్ గాంధీ సత్యం కోసం పోరాడుతున్నారు. ఆ పోరాటం కొనసాగుతుంది. లలిత్ మోడీ, నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతా వంటి వారు మోడీ ప్రభుత్వ కనుసన్నల్లోనే భారత్‌ను లూటీ చేసి పారిపోయారన్నది నిజం. బీజేపీ వారిని విడిపించింది. కానీ రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి తరిమికొట్టడానికి మోడీ సర్కారు కుట్ర చేసింది"అని ఆయన అన్నారు. ఇలాంటి అవినీతిపరులను తప్పించటం ద్వారా మోడీ సర్కారు అధికారాన్ని సుస్థిరరం చేసుకోవటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదన్నారు.

డేటా ప్రొటెక్షన్‌లో జోక్యమా..?

- కేంద్రానికి మినహాయింపులు ఆందోళనకరం
- వ్యక్తిగత సమాచార రక్షణ బిల్లుపై జస్టిస్ శ్రీకృష్ణ

న్యూఢిల్లీ : వ్యక్తిగత సమాచార రక్షణకు సంబంధించిన ముసాయిదా బిల్లులోని అన్ని సెక్షన్ల నుంచి ప్రభుత్వానికి, ప్రభుత్వ సంస్థలకు మినహాయింపు ఇవ్వడంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బీఎన్ శ్రీకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిమండలి ఈ నెల ఐదున ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. దీని ప్రకారం... తమ అంగీకారం లేకుండా ఎవరైనా వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించుకుంటున్నారని భావిస్తే (ఉదాహరణకు సెల్‌ఫోన్ నెంబర్లు లేదా ఆధార్ వివరాలు) ప్రజలు డాటా ప్రొటెక్షన్ బోర్డుకు ఫిర్యాదు చేయవచ్చు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే ఈ బోర్డులో సాంకేతిక నిపుణులు సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లును ప్రభుత్వం రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రవేశపెడుతుందా లేదా అనే విషయం తెలియరాలేదు. అయితే బిల్లు నుంచి ప్రభుత్వాన్ని, ప్రభుత్వ సంస్థలను మినహాయించడం ఆందోళన కలిగిస్తోందని జస్టిస్ శ్రీకృష్ణ తెలిపారు. ముసాయిదా బిల్లు ప్రభుత్వానికి అధిక వెసులుబాటు ఇస్తోందని, ప్రజల వ్యక్తిగత సమాచారానికి రక్షణ కల్పించే చర్యలేవీ ఇందులో పెద్దగా లేవని ఆయన వ్యాఖ్యానించారు. బిల్లులో అనేక లోపాలు ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగత సమాచార గోప్యతకు సంబంధించి ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కులను ఈ బిల్లు హరిస్తోందని విమర్శించారు. డాటా ప్రొటెక్షన్ బోర్డు కేంద్రం చేతిలో కీలుబొమ్మ అని, దానికి స్వతంత్రత లేదని అన్నారు. 2018లో తాను రూపొందించిన మొట్టమొదటి ముసాయిదా బిల్లులో స్వతంత్ర డాటా ప్రొటెక్షన్ అథారిటీ ఏర్పాటుకు సిఫారసు చేశానని గుర్తు చేస్తూ అలాంటి స్వతంత్ర సంస్థ అవసరం ఉన్నదని సూచించారు. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న బోర్డు ప్రభుత్వం చేతిలో బందీ అని అన్నారు. గత బిల్లు కంటే ఇది ఘోరంగా ఉన్నదని అంటూ మినహాయింపులు ఇస్తే సమస్య ఎలా పరిష్కారం అవుతుందని ఆయన ప్రశ్నించారు.

మీకోసం

ఎక్కిళ్లు ఆగకుండా వస్తుంటే కొంచెం పంచదార నోట్లో వేసుకుంటే తగ్గిపోతాయి.

జీవన సౌరభం

సాధ్యం కాదు అనుకుంటే ఏ పనీ చేతకాదు. ప్రయత్నించి చూడాలి. గెలిస్తే సంతోషం, ఓడితే అనుభవం వస్తాయి.

చదువుల గుడి

పుస్తకాలతో పునాది కడతాం
బలపాలతో బీములు వేస్తాం
పలకలతో స్లాబులు పోస్తాం
అక్షరాలతో అంతస్తులు నిర్మిస్తాం
గుణింతాలతో గోడలు కడతాం
రంగుల కలాలతో రంగులేస్తాం
విజ్ఞానం ఎంతో నేర్చేస్తాం
బడినే ఒక గుడిగా భావిస్తాం
చదువులమ్మ గుడిలో నిద్రిస్తాం
విజ్ఞానాన్ని విశ్వ వ్యాప్తం చేస్తాం!

- బోనగిరి పాండురంగ, తొర్రూరు.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఆంగ్ల అక్షరాలను ఒకసారి, అంకెలను ఒకసారి వేర్వేరుగా కలపండి. ఏ బొమ్మలు వచ్చాయో చూడండి.

నేను గీసిన బొమ్మ

కూరపాటి వందిత, 5వ తరగతి, ఎట్కిన్సన్ హయ్యర్ సెకండరీ స్కూలు, వన్‌టౌన్, విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సమైక్యతే మా జీవన విధానం

కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం రాజేసిన చిచ్చులో ఒక పక్క రాష్ట్రమంతా రెండు వర్గాల ఘర్షణలతో అట్టుడికిపోతుంటే మరోపక్క అవే రెండు వర్గాలు కలిసిమెలసి జీవిస్తూ.. మేం స్నేహితులం.. బంధువులం. మా మధ్య చిచ్చు పెట్టాలని చూసే వారిని మా గ్రామాల్లోకి కూడా రానీయమంటూ కంచె వేసుకుని ఉన్నారు. ఆ రాష్ట్రం మణిపూర్.. ఆ గ్రామం క్వాతా..

గ్రామంలోకి అడుగుపెడుతుంటే.. 'మేం శాంతిని కోరుకుంటున్నాం' అన్న అక్షరాలతో తెల్ల కాగితం మీద రాసిన ఓ నేమ్ బోర్డు గ్రామం మొదట్లో ఉన్న వెదురు తడికెకి వేలాడుతూ కనిపిస్తోంది. మణిపూర్ తెంగ్నోపాల్ జిల్లా ఖోబోలో నిర్మలమైన కొండల్లో ఈ గ్రామం ఉంది. గ్రామం చుట్టూ ఆరు కుకీ, మూడు నాగా గ్రామాలు ఉన్నాయి. మే 3న ప్రారంభమైన హింసాత్మక దాడులతో రెండు నెలలుగా రాష్ట్రమంతా హింసాత్మక దాడులు చెలరేగుతున్నాయి. 50 వేల మంది నిరాశ్రయులయ్యారు. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత తీవ్ర ఉద్రిక్త పరిస్థితిలో ఆ గ్రామం ఎడారిలో ఒయాసిస్సు మాదిరిగా కనపడుతోంది.

రాష్ట్రంలో మిగిలిన చోట్ల మెయితీల్లో ఉన్న అభద్రతా భావం గ్రామంలో ఉన్న మెయితీల్లో కనిపించడం లేదు. చాలా స్వేచ్ఛగా, పూర్తి రక్షణలో జీవిస్తున్నారు. 'మేమంతా ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటున్నాం. స్నేహితుల్లా మెలగుతున్నాం. ఇరువర్గాల పిల్లలను వివాహబంధంతో కలుపుకుని బంధువులయ్యాం. అంతరాలు లేకుండా సంతోషంగా జీవిస్తున్నాం. మా మధ్య ఎవరూ చిచ్చు పెట్టలేరు' అంటున్నాడు గ్రామ నివాసి టి సంజయ్ సింగ్.

గ్రామంలో 103 ఇళ్లు ఉంటే 302 మంది నివసిస్తున్నారు. వారిలో మైనార్టీగా ఉన్న మెయితీలు హింస ప్రారంభమైన మొదటిరోజున గ్రామం వదిలి వెళ్లిపోదామని నిశ్చయించుకున్నారు. ఆ విషయం తెలిసిన చుట్టుపక్కల గ్రామాల్లోని కుకీ వర్గం మెయితీల భయాన్ని పోగొట్టేలా వారికి రక్షణగా ఉంటామని చెప్పింది. 'ఇప్పటికీ మాకు లోయ ప్రాంతం నుండి మా బంధువులు ఫోన్లు చేస్తూనే ఉంటారు.

ఇబ్బందికర పరిస్థితులేమైనా తలెత్తాయా.. కుకీలు నుండి హాని కలుగుతుందా అంటూ ఆరా తీస్తున్నారు' అంటున్నాడు ఓ మెయితీ సభ్యుడు. 'లోయలో జరుగుతున్న హింస గురించి మాకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతోన్న గ్రామంలో మాత్రం చాలా భిన్న వాతావరణం ఉంది. మేం ఇక్కడ చాలా భద్రతలో ఉన్నాం' అంటున్నాడు అతడు.

గ్రామం వెలుపల కూడా..

మెయితీలకు రక్షణగా ఉంటామని తీర్మానించుకున్న ఆ గ్రామస్తులు గ్రామం వెలుపల కూడా వారికి భద్రత కల్పిస్తున్నారు. అవసరమైన వస్తువులు, వైద్య చికిత్స కోసం ఇంఫాల్ వెళ్లే మెయితీలకు మేం రక్షణ కల్పిస్తున్నాం' అంటున్నారు గ్రామపెద్ద కిషోర్. గ్రామం నుండి ఇంఫాల్ వెళ్లే మార్గంలో ఆరు కుకీ గ్రామాలు ఉన్నాయి. వాటి గుండా వెళ్లేటప్పుడు వాళ్లపై ఎటువంటి దాడులు జరగకుండా చూసుకుంటున్నారు. 'ఈ నెల మొదట్లో మెయితీలకు చెందిన ఓ గర్భిణీ చికిత్స కోసం ఇంఫాల్ హాస్పటల్‌కి వెళ్లాల్సి వచ్చింది. ఆర్మీ ఏర్పాటు చేసిన వాహనంలో ఆమె బయల్దేరేందుకు ధైర్యం చేయడం లేదు. అప్పుడు మాలో కొంతమంది ఆ వ్యానులో ఆమెతో పాటు ప్రయాణించాం' అంటున్నాడు కిషోర్.

'మా గ్రామం 700 ఏళ్ల క్రితం ఏర్పడింది. మా తాత, ముత్తాతల కాలం నుండి మేం ఇక్కడే ఉంటున్నాం. రెండు వర్గాలకు చెందిన వాళ్లం కలిసిమెలిసి ఉన్నాం. కలిసే పెరిగాం.. పండుగలు చేసుకున్నాం. కష్టం వచ్చినా, సంతోషమేసినా కలిసే అనుభవించాం. లోయలో హింస చెలరేగుతున్నప్పటి నుండి మేము తరచూ కుకీలతో చర్చలు నిర్వహిస్తున్నాం. మా గ్రామం చరిత్ర, మెయితీలతో మాకున్న అనుబంధం గురించి మాట్లాడుతున్నాం. మేము వాళ్లకి హానీ చేయలేదు. వాళ్లు మమ్మల్ని హింసించలేద'ని అంటోంది గ్రామంలోని కుకీ వర్గానికి చెందిన ఓ మహిళ.

కులం, జాతి, మతం, భూమి, నీరు పేరుతో కొంతమంది రాజేస్తున్న ద్వేషానికి దేశంలో ఎక్కడో ఓ చోట ఘర్షణలు తలెత్తుతూనే ఉంటాయి. మణిపూర్ హింస కూడా అటువంటి ప్రేరేపిత చర్యే.. అటువంటి చోట ఎడారిలో ఒయాసిస్సులా క్వాతా గ్రామం కనపడుతోంది. ఘర్షణ ప్రాంతాలకు దిక్సూచిలా నిలుస్తోంది.

ఫంగల్ ఇన్ఫెక్షన్లు రాకుండా ...

వర్షాకాలంలో ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. ఒకసారి వచ్చాయంటే ఓ పట్టాన వదిలిపోవు. చాలా అసౌకర్యాన్ని కలిగిస్తాయి. వచ్చాక జాగ్రత్తలు తీసుకోవడం కంటే రాకుండా జాగ్రత్త పడటం ముఖ్యం. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా సౌకర్యవంతంగా, ఆరోగ్యంగా ఉండేందుకు ఈ చిట్కాలు పాటించాలి.

వ్యక్తిగత పరిశుభ్రత

క్రమం తప్పకుండా స్నానం చేయాలి. తరచుగా చేతులు కడుక్కోవాలి. ప్రతిరోజూ ఉతికిన బట్టలే వేసుకోవాలి. పాదాలను శుభ్రంగా, పొడిగా ఉంచడం చాలా ముఖ్యం. పాదాలు సౌకర్యవంతంగా ఉండేలా బూట్లకు బదులుగా చెప్పులు లేదా ఓపెన్-టోడ్ బూట్లు ధరించడం మేలు. అలాగే గోళ్లను చిన్నగా శుభ్రంగా కత్తిరించుకోవాలి.

వస్త్రధారణ ఇలా ...

వదులుగా ఉండే దుస్తులను ధరించాలి. స్పాండెక్స్ లేదా నైలాన్ వంటి సింథటిక్ ఫ్యాబ్రిక్‌లను ధరించకూడదు. ఈ బట్టలు శరీరానికి గాలిని తగలనివ్వవు. శరీరంపై వేడి, తేమను పట్టిఉంచుతాయి. కాబట్టి వదులైన దుస్తులే వేసుకోవాలి.

చర్మాన్ని పొడిగా ఉంచండి..

ఫంగల్ ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే చుట్టూ ఉన్న వాతావరణాన్ని పొడిగా ఉంచాలి. నివాస స్థలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. అలాగే గాలిలో తేమను తగ్గించడానికి, శిలీంధ్రాల పెరుగుదలను అరికట్టడానికి ఇంటిలోని అన్ని ప్రాంతాలకు ధారాళంగా గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోండి.

ప్రత్యేక టవల్ ఉపయోగించండి..

తువ్వాలు లేదా దుస్తులు వంటి వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోవద్దు. ఇప్పటికే ఫంగల్ ఇన్ఫెక్షన్ సంకేతాలను చూపుతున్నట్లయితే ఇంకా జాగ్రత్త పడాలి. అలాగే లాకర్ రూమ్‌లు లేదా పబ్లిక్ పూల్స్ వంటి బహిరంగ ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవకూడదు. ఎందుకంటే ఈ ప్రదేశాల్లో తరచుగా తేమ ఎక్కువగా ఉంటుంది, ఇది శిలీంధ్రాల సంతానోత్పత్తికి కారణమవుతుంది.

తగిన చికిత్స తీసుకోవాలి

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఫంగల్ ఇన్ఫెక్షన్‌కు గురైతే.. తగిన చికిత్స తీసుకోవడం ముఖ్యం. తేలికపాటి ఫంగల్ ఇన్ఫెక్షన్‌లకు చికిత్స చేయడానికి ఓవర్-ది-కౌంటర్ యాంటీ ఫంగల్ క్రీమ్‌లు లేదా స్ప్రేలను ఉపయోగించవచ్చు. తీవ్రమైన ఇన్ఫెక్షన్ బారిన పడితే మాత్రం వైద్యుడిని సంప్రదించాలి.

విడుదలకు సిద్ధమవుతున్నాయ్..!

ఈ ఏడాది వేసవిబరిలోకి పెద్ద స్టార్ల సినిమాలేవి రాలేదు. చిన్న సినిమాలు, కుర్ర హీరోల సినిమాలతోనే వేసవి ముగిసింది. భారీ అంచనాలతో ఇటీవల విడుదలైన 'ఆదిపురుష్', 'స్పై', కూడా ప్రేక్షకులను మెప్పించలేదు. దీంతో అభిమానులంతా షూటింగుల్లో ఉన్న తమ అభిమాన హీరోల సినిమాల కోసం వేచిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో జులై ఆరంభం నుండి పెద్ద స్టార్లంతా వరుసగా తమ సినిమా షూటింగులు ముగించుకున్న అప్డేట్లు ఇస్తున్నారు. ఆ సినిమాల వివరాలు చూద్దాం..

చిరంజీవి..

చిరంజీవి, మెహర్ రమేష్ కాంబినేషన్‌లో రాబోతున్న 'భోళా శంకర్' చిత్ర షూటింగ్ జులై 3న పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం నిర్మాణాంతర పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలకు సిద్ధంగా ఉంది. పాటలు, టీజర్లు, ట్రైలర్లతో సందడి చేసేందుకు చిత్రబృందం రంగం సిద్ధం చేసుకుంటోంది. ఆగష్టు 11న ఈ సినిమా విడుదలవుతోంది. మహతి స్వరసాగర్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. తమన్నా, కీర్తిసురేష్, సుశాంత్ కీలక పాత్రల్లో నటించారు.

ప్రభాస్..

'బాహుబలి' తర్వాత విడుదలైన ప్రభాస్ చిత్రాలన్నీ ఆయన అభిమానుల్ని నిరాశ పరిచాయి. ఈ నేపథ్యంలో ప్రభాస్ రాబోయే చిత్రాలపై ఆసక్తి నెలకొంది. 'సలార్', 'ప్రాజెక్టు కె' చిత్రాలు వరుస షూటింగులు చేసుకుంటున్నాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్ నిర్మాణంలో తెరకెక్కుతోన్న 'సలార్' చిత్రాన్ని 2020లో ప్రకటించారు. కోవిడ్ తరువాత షూటింగ్ మొదలుపెట్టి రెండేళ్లకు పూర్తిచేశారు. ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా తాజాగా ఈ చిత్రం నుండి టీజర్ విడుదలైంది. శ్రుతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు పృధ్విరాజ్, జగపతిబాబు, ఈశ్వరీ రావు, శ్రీయ రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదలవ్వనుండగా ప్రస్తుతం మొదటి పార్టును ఈ ఏడాది సెప్టెంబరు 28న విడుదలకు సిద్ధం చేస్తున్నారు. నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తోన్న 'ప్రాజెక్టు కె' చిత్ర షూటింగ్ సెట్స్‌పై ఉంది.



పవన్ కళ్యాణ్..

'బ్రో', 'హరిహర వీరమల్లు', 'ఓజీ' చిత్ర షూటింగులతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ తాజాగా 'బ్రో' చిత్ర షూటింగ్ పూర్తి చేసుకున్నారు. ఈ నెల 28న విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్రంలో. కేతికా శర్మ, ప్రియా ప్రకాశ్ వారియర్, రోహిణి, సముద్రఖని, తదితరులు కీలకపాత్రలు పోషించారు. తమిళ చిత్రం 'వినోదాయ సీతం' రీమేక్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సముద్రఖని తెరకెక్కించారు. తమిళంలో కూడా ఆయనే దర్శకత్వం చేశారు. జీ స్టూడియోస్, పీపుల్స్ ఫ్యాక్టరీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ నెల 28న విడుదల కాబోతున్న ఈ చిత్ర షూటింగ్ పూర్తి చేసినట్లు కొన్ని రోజుల క్రితం సాయి ధరమ్ తేజ్ సోషల్‌మీడియాలో ప్రకటించారు. విడుదలకు చాలా తక్కువ సమయమే ఉండడంతో ప్రమోషన్ కార్యక్రమాలు వేగవంతం చేశారు.

బాలకృష్ణ..

అనిల్ రావిపూడి, బాలకృష్ణ కాంబినేషన్‌లో రాబోతోన్న 'భగవంత్ కేసరి' చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో తండ్రి పాత్రలో కనిపించనున్న బాలకృష్ణకు శ్రీలీల కూతురుగా నటిస్తున్నారు. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా కనిపిస్తున్నారు. బాలకృష్ణ కెరియర్‌లో 108వ చిత్రంగా రాబోతోన్న ఈ చిత్రం దసరా బరిలో నిలవనుంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ విలన్‌గా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఇక రామ్, నితిన్, నిఖిల్ వంటి కుర్ర హీరోలు కూడా తమ షూటింగులను కానిచ్చేస్తున్నారు. రాబోయే రోజుల్లో సినీ ప్రేక్షకులకు పెద్ద పండుగ వాతావరణమే కనిపిస్తోంది.

రవితేజ..

'టైగర్ నాగేశ్వరరావు', 'ఈగల్' చిత్రాల షూటింగుల్లో రవితేజ బిజీగా ఉన్నారు. 'ఈగల్' చిత్రీకరణ ఇప్పటికే ముగిసింది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా చేస్తున్నారు. కావ్యా థాపర్, నవదీప్, శ్రీనివాస్ అవసరాల, మధుబాల ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఈ చిత్రం నిలవనుంది. ఇక రవితేజ కెరియర్‌లోనే మొదటిసారిగా 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రం పాన్ ఇండియా సినిమాగా ఐదు భాషల్లో విడుదలవుతోంది. స్టూవర్టుపురం దొంగ 'నాగేశ్వరరావు' జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమా కూడా చివరి షెడ్యూల్‌లో ఉంది. ఈ ఏడాది అక్టోబరు 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. నుపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో రేణు దేశాయ్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. బాలీవుడ్ నటులు కూడా ఇందులో భాగమయ్యారు. జాన్ అబ్రహం, అనుపమ్ ఖేర్, కౌశిక్ మెహతా ఇందులో నటిస్తున్నారు. వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు.

భారత్ బోణీ

మెరిసిన హర్మన్‌ప్రీత్ కౌర్
తొలి టీ20లో బంగ్లాపై గెలుపు

మీర్పూర్ (బంగ్లాదేశ్) : హర్మన్‌ప్రీత్ కౌర్ (54 నాటౌట్, 35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టింది. స్లో వికెట్‌పై పరుగుల వేట గగనమైన వేళ.. ఛేదనలో నాయకురాలు బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో మెరిసింది. వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన (38, 34 బంతుల్లో 5 ఫోర్లు) సైతం రాణించటంతో బంగ్లాదేశ్‌తో తొలి టీ20లో భారత అమ్మాయిలు ఘన విజయం సాధించారు. 115 పరుగుల లక్ష్యాన్ని భారత్ 16.2 ఓవర్లలోనే ఛేదించింది. ఏడు వికెట్ల తేడాతో గెలుపొందిన టీమ్ ఇండియా టీ20 సిరీస్‌లో 1-0 ఆధిక్యం దక్కించుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు 114 పరుగులకే కట్టడి చేశారు. పూజ, మిన్నూ, షెఫాలీ వర్మలు తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు. బంగ్లాదేశ్ బ్యాటర్లలో ఎవరూ అంచనాలకు తగినట్టు ఆడలేదు. టాప్ ఆర్డర్‌లో రాణి (22), షబాన (23).. మిడిల్ ఆర్డర్‌లో అక్తర్ (28) చెప్పుకోదగిన ప్రదర్శన చేశారు. 20 ఓవర్లలో బంగ్లాదేశ్ 5 వికెట్ల నష్టానికి 114 పరుగులే చేసింది. ఛేదనలో తొలుత టీమ్ ఇండియా సైతం తడబడినా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఇన్నింగ్స్‌తో పరుగులు సులువుగా వచ్చాయి!. భారత్, బంగ్లాదేశ్ మహిళల రెండో టీ20 మంగళవారం మీర్పూర్‌లోనే జరుగనుంది.

ఎట్టకేలకు బజ్‌బాల్!

- ఛేదనలో బ్రూక్, క్రాలీ, వోక్స్ మెరుపుల్
- మూడో టెస్టులో ఇంగ్లాండ్ గెలుపు
- యాషెస్ సిరీస్‌పై ఆశలు సజీవం

లీడ్స్ (ఇంగ్లాండ్) : యాషెస్ సిరీస్ రెండో టెస్టులో 371 పరుగుల ఛేదనలో విజయానికి అత్యంత చేరువగా వచ్చిన ఇంగ్లాండ్.. దూకుడుగా ఆడినందుకు పశ్చాత్తాపం చెందలేదు. తర్వాతి టెస్టు లీడ్స్‌లో అంతకుమించిన దూకుడుతో బజ్‌బాల్ మెరుపుల్ మెరిపించి.. 3 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 251 పరుగుల సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 50 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇంగ్లాండ్ తరఫున యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (75, 93 బంతుల్లో 9 ఫోర్లు) అర్థ సెంచరీకి తోడు ఓపెనర్ జాక్ క్రాలీ (44, 55 బంతుల్లో 5 ఫోర్లు), క్రిస్ వోక్స్ (32 నాటౌట్, 47 బంతుల్లో 4 ఫోర్లు), మార్క్‌వుడ్ (16 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (5/78) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లతో పాటు బ్యాట్‌తో కీలక పాత్ర పోషించిన మార్క్‌వుడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. లీడ్స్ టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించగా యాషెస్ సిరీస్‌లో ఆ జట్టు 1-2తో నిలిచింది. మరో రెండు టెస్టులు మిగిలి ఉండగా.. సిరీస్‌పై ఆతిథ్య జట్టు ఆశలు సజీవంగా నిలుపుకుంది. జులై 19 నుంచి మాంచెస్టర్‌లో యాషెస్ నాల్గో టెస్టు జరుగనుంది. ఆసీస్ నిర్దేశించిన 251 పరుగుల ఛేదనలో.. ఇంగ్లాండ్ మూడో రోజే 27/0 పరుగులు చేసింది. దీంతో నాల్గో రోజు ఉదయం సెషన్‌కు మరో 224 పరుగుల వేటకు బరిలోకి దిగింది. కానీ ఇంగ్లాండ్ బజ్‌బాల్ మంత్ర పఠించినా.. ఆసీస్ అంత సులువుగా పట్టు విడువలేదు. ఓపెనర్ జాక్ క్రాలీ (44), బెన్ డకెట్ (23) తొలి వికెట్‌కు 42 పరుగులతో శుభారంభం అందించారు. మోయిన్ అలీ (5), జో రూట్ (21) నిరాశపరిచారు. దీంతో 131/4తో ఇంగ్లాండ్ కాస్త ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (75) బాధ్యత తీసుకున్నాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (13), జానీ బెయిర్‌స్టో (5)సైతం చేతులెత్తేయగా.. భారం అంతా బ్రూక్ మోశాడు. క్రిస్ వోక్స్ (32 నాటౌట్) జతగా కీలక భాగస్వామ్యం నిర్మించాడు. ఆరు ఫోర్లతో 67 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన బ్రూక్.. స్టార్క్ ఓవర్లో నిష్క్రమించటంతో కాస్త హైడ్రామాకు అవకాశం కనిపించింది. కానీ మార్క్‌వుడ్ (16 నాటౌట్) ఓ సిక్సర్, ఫోర్‌తో సమీకరణాలను మార్చివేశాడు. ఉత్కంఠను తొలగించి ఇంగ్లాండ్‌కు విజయాన్ని కట్టబెట్టాడు.

హ్యారీ బ్రూక్ (75)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68